ఆస్తి నిజం.. అధికారుల నిస్తేజం!!

న్యూస్‌టుడే, కార్పొరేషన్

'పన్ను' విధింపు.. పేర్ల మార్పులో అంతులేని జాప్యం!!
నిబంధనల పేరుతో రెవెన్యూ సిబ్బంది కాలయాపన
నగరంలో క్రయవిక్రయాలకు అగచాట్లు



మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఆస్తులకు పన్ను విధింపులో జాప్యం యజమానులకు చుక్కలు చూపిస్తోంది. నిబంధనల పేరుతో అర్హుల ఇళ్లకు కూడా పన్ను విధించకపోవడంతో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. మరోవైపు వార్డు సచివాలయ కార్యదర్శులకు ఆస్తి పన్ను విధింపు బాధ్యతలు అప్పగించడంతో వారికి పూర్తిగా అవగాహన లేక మరిన్ని కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది.

ఇంకొన్ని బాధలు ఇలా: వ్యక్తిగత గృహాలు విక్రయిస్తే, కొనుగోలు చేసుకున్న వ్యక్తి స్థలానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లన్నీ సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ఎంత మంది కొనుగోలు చేసిఉంటే వారి వివరాలన్నీ సమర్పించాల్సి ఉండటంతో ఇక్కట్లు తప్పడం లేదు.

● పేదలు నివసించే ప్రాంతాల్లో యాజమాన్య హక్కులు పూర్తిస్థాయిలో లేకుండానే ఆస్తి పన్ను విధించేవారు. తద్వారా ఆ ఇంటికి విద్యుత్తు కనెక్షన్, మంచినీరు, భూగర్భ మురుగునీటి కనెక్షన్ వంటి సౌకర్యాలు కలిగేవి. కొన్నాళ్లుగా ఆ విధానాన్ని పూర్తిగా నిలిపివేయడంతో చాలా ప్రాంతాలలో ప్రజలు మౌలిక వసతుల్లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వ పట్టాకూ పరీక్షే..

కొండవాలు, ప్రత్యామ్నాయ స్థలాలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన చోట క్రమబద్ధీకరణకు ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టాలు మంజూరు చేశారు. అనంతరం వైకాపా ప్రభుత్వంలో వాటికి రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఆయా ధ్రువీకరణ పత్రాలను తీసుకెళ్లి ఆస్తి పన్ను విధించాలని కోరితే, ప్రభుత్వం జారీ చేసిన పట్టా సరైందా? కాదా? నిర్ధారించాలని సిబ్బంది చెబుతుండటం కొసమెరుపు. గతంలో కలెక్టర్ కార్యాలయంలో పట్టాలు సరైనవా, నకిలీవా తెలుసుకునేలా వెబ్‌సైట్ రూపొందించి, ఆన్‌లైన్‌లో ఉంచారు. ఏడాదిన్నరగా ఆ వెబ్‌సైట్ పనిచేయడం లేదు. దీంతో ప్రభుత్వ పట్టాతో గృహాలు, స్థలాలను విక్రయించినా, కొనుగోలు చేసుకున్నవారి పేరిట ఆస్తి పన్ను మారక అగచాట్లు తప్పడం లేదు.

వారసత్వానికీ తప్పని తిప్పలు: కొన్ని కుటుంబాల్లో పూర్వీకుల పేరిట ఆస్తి పన్ను ఉంటుంది. ఫ్యామిలి మెంబర్ ధ్రువీకరణ, దశాబ్దాల క్రితం మృతి చెందినవారి మరణ ధ్రువీకరణ వంటి పత్రాలు చూపించి ఆస్తి పన్ను మార్చుకోవాలని సూచిస్తున్నారు. ఇలాంటి వారసత్వ ఆస్తులను ఇతరులకు విక్రయించినా, చనిపోయినవారిన పేరిటే ఆస్తి పన్ను కట్టాల్సిన పరిస్థితులున్నాయి. పాతనగరం, అల్లిపురం, కంచపాలెం, గాజువాక, ఆరిలోవ, మధురవాడ, చినముషిడివాడ తదితర ప్రాంతాలలో ఇలాంటి సమస్య అధికంగా ఉంది.

మా తాత ఆస్తికి పన్ను మార్చడంలేదు..

మా తాత పేరిట ఉన్న ఆస్తి పన్ను నా పేరుపై మార్చాలని వార్డు సచివాలయం కార్యదర్శిని సంప్రదించాను. మరణ ధ్రువీకరణ, ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్, లింకు డాక్యుమెంట్లు సమర్పిస్తే మా నాన్న పేరుపై ఆస్తి పన్ను ముందు మారుస్తామని చెప్పారు. అనంతరం ఆయన వారసుడిగా నిరూపించుకుంటే నా పేరిట ఆస్తి పన్ను విధిస్తామని చెప్పారు. అరవై ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తికి సంబంధించిన పత్రాలెలా తీసుకురావాలి. *–సీహెచ్ వెంకటరావు, అల్లిపురం*

పట్టా నిజమైందనే ధ్రువీకరణ కావాలంట..

ప్రభుత్వం జారీ చేసిన పట్టా అసలైందా? నకిలీదా? అంటూ ధ్రువీకరించమని చెబుతుండటం హాస్యాస్పదంగా ఉంది. రెవెన్యూ సిబ్బందిని కలిస్తే, మాకు సంబంధం లేదని, ఎలా నిర్ధారిస్తామని ప్రశ్నిస్తున్నారు. దీంతో మా ఆస్తిని విక్రయించుకోవడానికి వీలు పడటంలేదు. *–డి.సీతామహాలక్ష్మి, సీతమ్మధార*

కౌన్సిల్‌లో చర్చించి ప్రభుత్వానికి నివేదించాలి..: 'ఆస్తి పన్ను విధింపులో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. ముందుగా కౌన్సిల్‌లో సభ్యులు ఆయా అంశాలపై చర్చించి, పరిష్కారానికి తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా పన్నులు విధిస్తున్నాం. వాటిలో ఉన్న కొన్ని నిబంధనల వల్ల ఆస్తి పన్ను విధింపు, బదలాయింపు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వారసుల గుర్తింపు, పట్టాల తనిఖీలలో ఇబ్బందులున్నాయి. ఇటీవల నగర శాసనసభ్యులు ఆయా అంశాలపై చర్చించారు. త్వరలో కమిషనర్‌తో చర్చించి సమస్యలను పాలకవర్గం సభ్యులకు తెలియజేస్తాం. హక్కులన్నీ ఉన్నా, ఆస్తి పన్ను బదలాయింపు జరగకపోవడంపైనా చర్చించాల్సి ఉంది.
– ఎస్.శ్రీనివాసరావు, రెవెన్యూ, ఉప కమిషనర్

ఇలాంటి సమస్య మీరూ ఎదుర్కొంటున్నారా.. అయితే మీ పేరు, ప్రాంతం వివరిస్తూ సమస్యను సంక్షిప్తంగా ఈ నంబర్‌కు వాట్సాప్ చేయండి:
80085 66543

మద్యం తయారీలో మాయలెన్నో!



డిస్టిలరీల్లో అక్రమాలపై సీఐడీ తనిఖీలు

ఈనాడు, విశాఖపట్నం, అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో మద్యం తయారీ నుంచి అమ్మకాల వరకు అన్నింటా అడ్డదారులు తొక్కారు. నాసిరకం మద్యం అమ్మి మందుబాబుల ఆరోగ్యంతో ఆటలాడుకున్నారు. డిస్టిలరీల నుంచి అనధికారికంగా మద్యం తరలించి పన్నులు చెల్లించకుండా రూ. కోట్లు కొల్లగొట్టారు. ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి వాసుదేవరెడ్డిపై ఇప్పటికే కేసు నమోదు చేశారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా మద్యం తయారుచేసే డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని విశాఖ, జీఎస్‌బీ డిస్టిలరీల్లో మంగళవారం సీఐడీ తనిఖీలు నిర్వహించింది. గత అయిదేళ్లలో ఈ రెండు డిస్టిలరీల్లో ఎంత మద్యం తయారయింది, అధికారికంగా ఎంత అమ్మకాలు చేసింది, ఎంత పక్కదారి పట్టించింది క్షుణ్ణంగా పరిశీలించారు. పదిమంది అధికారుల బృందం ఈ రెండు యూనిట్లలో ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు చేపట్టి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. తనిఖీల వేళ మీడియాను అనుమతించలేదు.

➤ వైకాపా పాలనలో ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే వాటిని తయారు చేసే డిస్టిలరీల్లోనే ఎక్కువ మాయజాలం చేసేవారు. ఒక డిస్టిలరీలో తయారైన మద్యం కేసులన్నీ అధికారికంగా సరఫరా చేస్తే వాటిపై ఎక్సైజ్ డ్యూటీ చెల్లించాలి. కాని వైకాపా హయాంలో ఓ డిస్టిలరీలో లక్ష కేసులు మద్యం తయారైతే అందులో 30 నుంచి 40 శాతం అనధికారికంగా తరలించి అమ్మేసుకునేవారనే ఆరోపణలున్నాయి. ఈ మద్యానికి సంబంధించి ఎలాంటి పన్నులు ప్రభుత్వ ఖజానాకు చేరేవి కావు. నేరుగా అప్పటి ప్రభుత్వ పెద్దల జేబుల్లోకే వెళ్లిపోయేవి. తాజా తనిఖీల్లో ఈ అక్రమాల గుట్టునే వెలికితీస్తున్నారు. సుందరయ్యపేటలోని జీఎస్‌బీ డిస్టిలరీ సామర్థ్యం కంటే తక్కువగానే మద్యం తయారుచేస్తున్నారు.




రుషికొండపై రూ.కోట్లు కుమ్మరించి కట్టిన భవనాల ముందు రూ.లక్షలు వెచ్చించి ఎన్నో మొక్కలు, చెట్లు నాటారు. వాటి ఆలనా, పాలనా చూసేవారు కరవై... ఎన్నో ఎండిపోతున్నాయి. లోపలికి వెళ్లే మార్గంలో మోడువారిన చెట్లను చిత్రంలో చూడొచ్చు. –ఈనాడు, విశాఖపట్నం

23, 24, 25 తేదీల్లో పలు రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: 'దానా' తుపాను నేపథ్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో తూర్పు కోస్తా రైల్వే పరిధిలో సుమారు 70 రైళ్లను రద్దు చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 23న హైదరాబాద్-హావ్‌డా ఈస్ట్‌కోస్టు, సికింద్రాబాద్-హావ్‌డా ఫలక్‌నుమా, కన్యాకుమారీ-డిబ్రూఘర్-కన్యాకుమారీ, ముంబయి-భువనేశ్వర్ కోణార్క్, చెన్నై సెంట్రల్-హావ్‌డా మెయిల్, సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ తదితర 18 రైళ్లను రద్దు చేశారు. 24న షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్, పట్నా-ఎర్నాకుళం, హావ్‌డా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా, భువనేశ్వర్-విశాఖ వందేభారత్, షాలిమార్-వాస్కోడిగామా అమరావతి ఎక్స్‌ప్రెస్ తదితర 37 రైళ్లు, 25న విశాఖ-అమృత్‌సర్, విశాఖ-భువనేశ్వర్, విశాఖ-గుణుపూర్, విశాఖ-బ్రహ్మపుర తదితర 11 రైళ్లను రద్దు చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు... ఉచితంగా సౌర విద్యుత్తు



'సౌర విద్యుత్తు' వినియోగానికి ముందుకు వచ్చేవారికి 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ' పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయి. మూడు కిలోవాట్లకు రూ. 78 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. మిగతా సొమ్ములు లబ్ధిదారులు భరించాలి. అయితే .. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగానే ఈ సౌర విద్యుత్తును అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిస్కంల వారీగా ఆయా వర్గాల లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు.. వారిలో ఎంతమంది సోలార్ విద్యుత్తుపై ఆసక్తి చూపుతున్నారో సర్వే చేయిస్తున్నారు.



● తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలోని అయిదు ఉమ్మడి జిల్లాల్లో 7.22 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. సౌరపలకలు ఇంటి పైభాగంలో అమర్చాలంటే సుమారు 100 చ.అ. విస్తీర్ణం అవసరం. ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఎస్టీ లబ్ధిదారుల్లో చాలామంది పూరిళ్లు, పెంకుటిళ్లలోనే నివాసం ఉంటున్నారు. సోలార్ పరికరాలు అమర్చడానికి వీలులేని గృహాలే ఎక్కువ ఉన్నాయి. మైదాన ప్రాంతంలోని ఎస్సీ లబ్ధిదారులున్నా వారిలో కూడా చాలామంది కాలనీల్లో ఉంటున్నారు. వారి ఇంటి పైకప్పులు సోలార్ పలకల ఏర్పాటుకు అనువుగా లేవని అధికారులంటున్నారు.

ఇద్దరికీ లాభమే..


ఈ కనెక్షన్ల వల్ల ఇటు లబ్ధిదారులకు, అటు ప్రభుత్వానికి ప్రయోజనమే. సౌర పలకలపై పెట్టుబడితో ప్రభుత్వంపై మొదట కొంత ఆర్థిక భారం పడినా దీర్ఘకాలంలో విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు భారీగా తగ్గనుంది.

వందశాతం రాయితీతో సోలార్ పరికరాలు
ఈపీడీసీఎల్ పరిధిలో లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే

➤ ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు లోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఈ విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు అంతా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఒక్కో యూనిట్‌పై సుమారు రూ. 6 వరకు వెచ్చిస్తోంది. అదే సోలార్ ద్వారా ఉచితంగా వారికి విద్యుత్తును అందించగలిగితే ప్రభుత్వానికి ఆ మేరకు ఆదా అయినట్లే. ఈ లబ్ధిదారులు చాలా మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తుంటారు. ఒక కిలోవాట్ సోలార్ ఉపకరణాలతో నెలకు 120 యూనిట్లు సౌరశక్తి ద్వారా అందుబాటులోకి వస్తుంది. మిగతా 20 నుంచి 30 యూనిట్ల భారమే ప్రభుత్వంపై పడుతుంది.

➤ 'ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి జరిగితే ఆ మిగులు కరెంటును డిస్కంకు విక్రయించొచ్చు. ఒకసారి సోలార్ పలకలు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా విద్యుత్తు అందుతుంది. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుంది' అని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

ఈపీడీసీఎల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు కనెక్షన్ల వివరాలు..



ఉక్కులో 'స్వచ్ఛంద ఉద్యోగ విరమణ'కు సర్వే

ఉక్కునగరం, న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం (వీఆర్‌ఎస్) సర్వేకు మంగళవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉక్కు కార్మికుల పోర్టల్ సపోర్ట్ సిస్టమ్‌లో 'వీఆర్‌ఎస్' పేరుతో ఓ ఏర్పాటు చేశారు. ఈ సర్వే సాధారణ ఉద్యోగులకు (ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్) మాత్రమే వర్తిస్తుందన్నారు. కనీసం 15 ఏళ్ల సర్వీసు కలిగి ఉండాలని, లేదా 2024 సెప్టెంబర్ 30 నాటికి 45 ఏళ్లు పూర్తి చేసుకున్న వారే అర్హులని, అలాంటి వారే వీఆర్‌ఎస్‌కు సుముఖత వ్యక్తం చేయొచ్చని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ కేవలం సర్వే కోసమేనని, దీన్ని వీఆర్‌ఎస్ దరఖాస్తుగా పరిగణించలేమని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


మంచుఖండంలో అధ్యయనానికి గిరిబిడ్డ



హుకుంపేట, న్యూస్‌టుడే: పర్యావరణ అధ్యయనం కోసం అంటార్కిటికా వెళ్తున్న భారత శాస్త్రవేత్తల బృందానికి గిరిబిడ్డ **వరదాని రమణమూర్తి** నాయకత్వం వహిస్తున్నారు. హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీ ఉక్కుర్బా గ్రామానికి చెందిన రమణమూర్తి పేద కుటుంబంలో జన్మించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాస్టర్ డిగ్రీలో బయోఫిజిక్స్ పూర్తిచేశారు. విశాఖపట్నంలోని భారతీయ భూ అయస్కాంత పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం (2024-25) అంటార్కిటికా ఖండానికి భారత శాస్త్రవేత్తల బృందం పర్యావరణంపై అధ్యయనానికి వెళ్తోంది.

5.29 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు?

మార్గదర్శకాలకు యంత్రాంగం ఎదురుచూపులు



వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. మార్గదర్శకాలు ఇంకా రానప్పటికీ గ్యాస్ కనెక్షన్ల వివరాలు, ఇతరత్రా సమాచారాన్ని సేకరించి సిద్ధం చేశారు. కూటమి నాయకులు ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి 3 చొప్పున సిలిండర్లను ఉచితంగా అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా దీపావళి పర్వదినం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో మహిళల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 24 నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్‌లు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. పథకం అమలుకు సంబంధించి మంగళవారం సాయంత్రం వరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదని, ఏ క్షణంలో అయినా వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.2553 లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా ఐఓసీ, హెచ్‌పీసీఎల్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో 9.05 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్లకార్డులను ప్రాతిపదికగా తీసుకుంటే 5,29,054 కుటుంబాలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఒక్కో సిలిండర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ. 851 రాయితీగా ఇవ్వనున్నది. ఏడాదికి మూడు సిలిండర్లు అంటే ఒక్కో కుటుంబానికి రూ. 2,553 వరకు లబ్ధి చేకూరనుంది. భారీ రాయితీతో కూడిన పథకం కావడంతో పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంది. లేదంటే రాయితీ సిలిండర్లు నల్లబజారుకు వెళితే ప్రభుత్వ లక్ష్యానికి గండి పడినట్లే.

● దీపం పథకం కనెక్షన్లకు మాత్రమే పరిమితమైతే జిల్లాలో 1.31లక్షల మంది లబ్ధి పొందే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ప్రతి పేద కుటుంబానికి ఇస్తామని కూటమి నేతలు హామీ ఇవ్వడంతో తెల్లకార్డుదారులందరికీ ఈ పథకం వర్తిస్తుందనే భావన వ్యక్తమవుతోంది. దీనిపై పూర్తి స్పష్టత రావాల్సి ఉందని, తమ వరకు పూర్తి వివరాలు సిద్ధం చేసుకొని ఉన్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 55 వంట గ్యాస్ సరఫరా డీలర్లు ఉన్నారు. వీరిలో అయిదుగురు గ్రామీణ ప్రాంతాల్లో ఉండగా, మిగిలిన 50 మంది జీవీఎంసీ పరిధిలో ఉన్నారు.

నేడు నర్సుల సంఘానికి ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ ఎన్నికలు బుధవారం నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్నదని ఎన్నికల అధికారి, సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న నర్సులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందన్నారు. నిర్ణీత రుసుము చెల్లించి సభ్యత్వం తీసుకున్న 555 మంది మాత్రమే ఓటర్లుగా ఉన్నారని, వీరు ఎన్నికల బరిలో ఉన్న 19 మందిలో 9 మందిని ఎన్నుకోవాల్సి ఉందన్నారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటిస్తామన్నారు. అధ్యక్ష పదవితో పాటు ఉపాధ్యక్ష, కోశాధికారి, అయిదుగురు కార్యవర్గ సభ్యులకు ఇద్దరేసి చొప్పున, కార్యదర్శి పదవికి ముగ్గురు పోటీ పడుతున్నారన్నారు. బరిలో ఉన్న అభ్యర్థులతో మంగళవారం కేజీహెచ్‌లో సమావేశం నిర్వహించి, విధి విధానాలను తెలియజేశామని ఎవరూ నిబంధనలు ఉల్లంఘించవద్దని సూచించామన్నారు. కేజీహెచ్ ఆవరణలోని క్లోక్‌రూమ్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

● ఎన్నికల బరిలో ఉషారాణి, గంగా భవాని ప్యానళ్లు ఉన్నాయి. రెండు ప్యానళ్లు గత కొద్ది రోజుల నుంచి ముమ్మరంగా ప్రచారం నిర్వహించాయి. బుధవారం సాయంత్రం నాటికి వీరిలో విజేతలు ఎవరో తేలిపోతుంది.

'ముడసర్లోవ' మారిన కథ..!

న్యూస్‌టుడే, కార్పొరేషన్

జలవనరులను కాపాడుకుంటే అవి ఎంతగా మేలుగా చేస్తాయో ముడసర్లోవ రిజర్వాయర్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ రిజర్వాయర్‌కు ఇటీవల జాతీయ స్థాయిలో కేంద్ర జలశక్తి అవార్డు లభించింది. జీవీఎంసీకి చెందిన ఏకైక రిజర్వాయర్ ఇదే. గతంలో దీని పరిసరాలు కళావిహీనంగా ఉండేవి.. ప్రస్తుతం పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారాయి.



ఏటా ఎండా కాలంలో పూర్తిగా ఎండిపోయే దశ నుంచి నాలుగేళ్లుగా నిత్యం నీరు నిల్వ ఉండే స్థాయికి రిజర్వాయర్ చేరుకుంది. జీవీఎంసీ మరో రూ. 50 కోట్లు వెచ్చించగలిగితే ప్రస్తుత నీటి సామర్థ్యాన్ని 20శాతం వరకు పెంచొచ్చు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో తొలి తేలియాడే సౌర విద్యుత్తు ప్రాజెక్టును ఈ రిజర్వాయర్‌పైనే గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచి నిత్యం 11 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ జీవీఎంసీ ఆదాయం సమకూర్చుకుంటోంది.

మార్పు ఇలా ఆరంభం..

వాటర్‌మెన్‌గా పేరొందిన డాక్టర్ రాజేంద్రసింగ్ కొన్నాళ్ల కిందట ముడసర్లోవలో పర్యటించారు. చుట్టూ కొండలున్నా రిజర్వాయర్‌లోకి నీరు చేరకపోవడాన్ని చూసి ఆశ్చర్య పోయారు. నీరు వచ్చే కల్వర్టుల్లో వ్యర్థాలు పేరుకుపోవడం గుర్తించారు. అటవీశాఖ భూముల వైపు ఉన్న కొండలపై నుంచి నీరు చేరకపోవడాన్ని గమనించారు. ఈ విషయాలతో నాటి జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు.

● స్పందించిన కమిషనర్ రూ. 9కోట్లతో టెండర్లు పిలిచి రిజర్వాయర్ చుట్టూ శుభ్రం చేయించి, మొక్కలు నాటించారు. రిజర్వాయర్‌లోకి నీరు చేరడానికి 300 మీటర్ల మేర రాతి నిర్మాణం చేపట్టారు. కొద్దిపాటి పూడికనూ తొలగించారు. దీంతో రిజర్వాయర్‌లోకి నీరు చేరి, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి.

భూ వినియోగం మార్పుతో చేటు: వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు ముడసర్లోవ రిజర్వాయర్ పరిసర స్థలాలను కొట్టేయడానికి కుట్ర పన్నారు. నిబంధనలకు విరుద్ధంగా భూ వినియోగమార్పిడి చేపట్టారు. ఈ మార్పుతోనే ముడసర్లోవ పార్కులో హార్స్ రైడింగ్ ప్రాజెక్టు, గోల్ఫ్‌కోర్సుకు లీజుకిచ్చిన భూముల్లో భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. రూ. 100 కోట్లతో అక్కడ వివిధ రకాల థీమ్‌పార్కులు నిర్మాణం చేపట్టాలని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. దశాబ్దాల నుంచి కాపాడుకుంటూ వస్తున్న ఆయా భూములను పార్కులుగా మార్చి లీజుకిచ్చే చర్యలకు కూటమి ప్రభుత్వం అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

నాలుగేళ్లలో సరికొత్తగా రూపురేఖలు
కేంద్ర జలశక్తి శాఖ గుర్తింపు

రిజర్వాయర్ సంగతులు..

విస్తీర్ణం: 120 ఎకరాలు	జీవీఎంసీ సేకరిస్తున్న నీరు: 0.5 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ పర్ డే)
గరిష్ఠ నీటి మట్టం: 169 అడుగులు	ఆధారపడిన ప్రజలు: లక్ష
కనిష్ఠం: 152 అడుగులు	అభివృద్ధికి చేసిన వ్యయం: రూ.9 కోట్లు


రిజర్వాయర్‌పై తేలియాడే సౌర విద్యుత్తు ప్లాంట్

దుకాణాల నుంచి గోదాముకు!!

◆ ప్రభుత్వ మద్యం దుకాణాల సామగ్రి అందజేత
◆ రశీదులివ్వకపోవడంతో సిబ్బంది తర్జన భర్జన

ఆనందపురం, న్యూస్‌టుడే

మద్యం క్రయ విక్రయాలను స్వయంగా ప్రభుత్వమే నిర్వహించేలా గత వైకాపా సర్కారు అమలు చేసిన విధానం సరికాదని కూటమి ప్రభుత్వం భావించి వీటి నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇప్పటి వరకు విక్రయించగా మిగిలిన మద్యం, వినియోగించిన వాహనాలు, దుకాణాల అద్దెలు, సిబ్బంది జీతభత్యాలు వంటి అంశాలపై ఆబ్కారీ శాఖ అధికారులకే ఇంకా ఓ స్పష్టత లేకపోవడంతో ఇప్పటి వరకు ఆయా దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది తర్జన భర్జన పడుతున్నారు.

★ ఈనెల 14వ తేదీన మద్యం దుకాణాలకు లాటరీల ద్వారా వ్యాపారులను ఎంపిక చేసి 16వ తేదీ నుంచి అమ్మకాలకు అనుమతులిచ్చారు. విశాఖ జిల్లాలో ఆనందపురం ఆబ్కారీశాఖ గోదాముల పరిధిలో 70 దుకాణాలు ఉండగా ఈనెల 15వ తేదీ రాత్రి 9 గంటల వరకు ప్రభుత్వ



వెనక్కి తెచ్చిన ఎలక్ట్రానిక్ పరికరాలు, మద్యం, ఫర్నిచర్

మద్యం దుకాణాల్లో విక్రయాలు జరిగాయి. ★ 16వ తేదీ నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడడంతో వాటిలో మిగిలిన మద్యం నిల్వలు, ఫర్నిచర్, కంప్యూటర్ ఇతర సామగ్రిని అధికారులు వెనక్కి రప్పించి గోదాముకు తరలించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఆయా దుకాణాల్లో పనిచేసిన సిబ్బందికి తిరుగు రశీదులు ఇవ్వకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ★ వారికి గత నెల వేతనంతో పాటు ఈ నెల జీతభత్యాలు ఇవ్వలేదు. వీరి నియామకం సమయంలో దుకాణాల్లో ఉన్న వస్తువులకు సంబంధించి ఆబ్కారీ శాఖ రూ.100 విలువ గల బాండ్లపై అంగీకారపత్రాలు తీసుకుంది. ఇప్పుడు దుకాణాల నుంచి వాటిని వెనక్కి తీసుకున్న సమయంలో ఎలాంటి రశీదులు ఇవ్వకపోవడంతో వారు తర్జన భర్జన పడుతున్నారు.

ఆనందపురం గోదాముకు ఏమేమి తీసుకొచ్చారంటే..

★ మద్యం	:	6192 కేసులు(పెట్టెలు)
★ కంప్యూటర్లు	:	70
★ ట్యాబ్‌లు	:	70
★ సీసీ కెమెరాలు	:	140
★ ఫ్రిజ్‌లు	:	70
★ సీలింగ్ ఫ్యాన్లు	:	70

★ గోదాము పరిధిలో ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలుకు గతంలో సుమారు రూ.2కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

★ 15వ తేదీ తర్వాత వెనక్కి తెచ్చిన మద్యం ఖరీదు సుమారు రూ.8 కోట్లు ఉంటుందని అంచనా.

ఈ విషయమై ఆబ్కారీ శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా.. ఆనందపురం గోదాముల పరిధిలోని 70 దుకాణాల నుంచి మద్యం నిల్వలు, ఫర్నిచర్ ఇతర సామగ్రి వెనక్కి తెచ్చాం. వీటికి సంబంధించి అక్కడి సిబ్బంది సమక్షంలోనే లెక్కించాం. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని అన్నారు.

'జల సంరక్షణ'కు జాతీయ పురస్కారం



కేంద్రమంత్రి పాటిల్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న తిరుమల నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఉక్కునగరం (కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే : నీటి సంరక్షణ చర్యలు పాటిస్తున్నందుకు కూర్మన్నపాలెం సమీప 'శ్రీ తిరుమలనగర్ సంక్షేమ సంఘానికి' దేశ వ్యాప్త గుర్తింపు దక్కింది. మంగళవారం దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో 5వ వాటర్ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ చేతుల మీదుగా తిరుమలనగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి పరమానందం కలిసి తృతీయ పురస్కారాన్ని అందుకున్నారు. సంఘం ఆధ్వర్యంలో కాలనీలో 100 రూఫ్ టాప్ ఇంకుడు గుంతల ద్వారా 16 లక్షల క్యూబిక్ లీటర్ల నీటిని పొదుపు చేశారు. అలాగే పార్కులు, రహదారుల పక్కన మరో 62 ఇంకుడు గుంతలు తవ్వి 30.97 లక్షల క్యూబిక్ లీటర్ల నీటిని సంరక్షించడంతో పురస్కారానికి ఎంపిక చేశారు.

సమష్టి కృషితో జిల్లాకు జల్‌శక్తి అవార్డు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జలవనరుల నిర్వహణ, సంరక్షణలో 2023 ఏడాదికి గాను ఉత్తమ జిల్లా కేటగిరీలో విశాఖకు కేంద్ర జల్‌శక్తి అవార్డు లభించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం న్యూదిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలవనరులు, జీవీఎంసీ, మైక్రో ఇరిగేషన్, ఉద్యానవనాలు, అటవీ, పర్యావరణం, ఆరోగ్యం, విద్య, డ్వామా విభాగాలు సమష్టిగా ఏడాదిపాటు జిల్లాలో జలవనరుల సంరక్షణకు చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కిందన్నారు. విశాఖ నగరంలో 24గంటలపాటు నీటి సరఫరాను 40 చదరపు కిలోమీటర్ల పరిధిలో అమలు చేశారన్నారు. ఫలితంగా జాతీయ స్థాయిలో జల్‌శక్తి అవార్డు జిల్లా కైవసం చేసుకుందని తెలిపారు.

పార్కులు, మైదానాలకు మహర్దశ

గాజువాకలో ఎంపీ, ఎమ్మెల్యే, వీఎంఆర్‌డీఏ కమిషనర్ పర్యటన

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలిచిన గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లోని పబ్లిక్ పార్కులు, క్రీడా మైదానాలకు మంచి రోజులు రానున్నాయి. మంగళవారం విశాఖ ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఇతర అధికారులు గాజువాకలో పర్యటించారు. చినగంట్యాడ అమరావతి పార్కు, వుడాకాలనీ ఓపెన్ ఆడిటోరియాన్ని పరిశీలించి ఆధునికీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. పెదగంట్యాడ క్రీడా స్టేడియాన్ని క్రీడలకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. కణితిరోడ్డు నుంచి గోపాలరెడ్డినగర్ వరకు ఉన్న వుడాసెంటర్ మీడియం డివైడర్ పార్కులను తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. అనంతరం దయాల్‌నగర్ కొండపై వుడా స్థలాన్ని పరిశీలించి... సౌకర్యాల కల్పనపై చర్చించారు. వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, జెడ్పీ శేషాద్రి, పర్యవేక్షక ఇంజినీరింగ్ బలరామరాజు, కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, బాలునాయుడు, మహ్మద్ రఫీ, రమణారెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



దయాల్‌నగర్ కొండను పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

మందులు → పరీక్షలు ఇక్కడే..

విమ్స్‌లో త్వరలో ప్రారంభం కానున్న డ్రగ్ స్టోర్, డయాగ్నస్టిక్ సెంటర్

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే

విశాఖ వైద్య విజ్ఞాన కేంద్రం(విమ్స్ ఆసుపత్రి) మరో రెండు విభాగాలు సమకూర్చుకొని ఉత్తరాంధ్ర ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించడానికి సిద్ధమవుతోంది. రూ. 20 కోట్ల వ్యయంతో ఏపీఎస్ఐఎండీసీ ఆధ్వర్యంలో సిటీ డయాగ్నస్టిక్ సెంటర్, రీజనల్ డ్రగ్ స్టోర్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనివల్ల పేద ప్రజలకు పలు ప్రయోజనాలు సమకూరనున్నాయి.



సిటీ డయాగ్నస్టిక్ సెంటర్, రీజనల్ డ్రగ్ స్టోర్

సిటీ డయాగ్నస్టిక్ సెంటర్..

విమ్స్‌లో ఏర్పాటు కానున్న సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో పాథాలజీ, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, ఎంఆర్ఐ, సిటీస్కాన్, ఈసీజీ, 2డీ ఎకో, రక్తపరీక్షలు, స్కానింగ్ ఉచితంగా నిర్వహిస్తారు. ఇవి కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తుండగా, విమ్స్‌లో నామమాత్రపు రుసుములు తీసుకుని చేస్తున్నారు. ఈ కేంద్రం వస్తే పూర్తి ఉచితంగా సేవలు అందనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రేడియాలజీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేంద్రం ఏర్పాటు అయితే కేజీహెచ్ మీద కూడా భారం తగ్గనుంది.

ప్రాంతీయ మందుల నిల్వ కేంద్రం..

ఉత్తరాంధ్ర జిల్లాలకు అవసరమయ్యే మందులు, వైద్య పరికరాలు అందించే ఉద్దేశంతో విమ్స్‌లో ప్రాంతీయ మందుల నిల్వ కేంద్రం త్వరలో ప్రారంభించనున్నారు. ఈ కేంద్రంలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రధాన ఆసుపత్రులకు రాష్ట్ర వైద్యవిద్య ఆధ్వర్యంలో మందులు, శస్త్రచికిత్స పరికరాలు నిల్వ చేయనున్నారు. ఇక్కడ మందులు, శస్త్రచికిత్సల పరికరాలు అందుబాటులో ఉంచటం వల్ల రాజధాని నుంచి వచ్చే కాలయాపన తగ్గనుంది.

కేజీహెచ్‌కు ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దాలనే

కేజీహెచ్‌లో రోగనిర్ధారణ పరీక్షలకు రద్దీ అధికంగా ఉంటుంది. అటువంటి వారికి వివిధ రకాల వైద్య పరీక్షల కోసం ఇక్కడ ఏర్పాటు చేయనున్న సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ బాగా ఉపయోగపడుతుంది. డ్రగ్ స్టోర్ వల్ల ఉత్తరాంధ్రలోని ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా ఇక్కడి నుంచే మందులు సరఫరా అవుతాయి. త్వరలో వీటిని ప్రారంభిస్తాం.



– డాక్టర్ రాంబాబు డైరెక్టర్ విమ్స్

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పక్కాగా హిందీ అమలు



సదస్సులో పాల్గొన్న వివిధ శాఖల ఉన్నతాధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ భాషను పక్కాగా అమలు చేయనున్నట్లు ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. చేపలరేవు సమీపంలోని భారత మత్స్య పరిశోధన సంస్థ (ఎఫ్ఎస్ఐ) కార్యాలయంలో మంగళవారం నగర రాజభాష కార్యాన్‌వ్యాన్ సమితి విశాఖపట్నం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీ, సిఫ్‌నెట్, నిఫ్‌ఫాట్, ఎంఎండీ, డీఎల్ఎల్, ఎన్ఎస్‌టీఎల్, జీఎస్ఐ, కేంద్రీయ విద్యాలయం, ఆకాశవాణి, ఏయూ, ఇన్‌కంటాక్స్, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్, సైక్లోన్ వార్నింగ్ కేంద్రం, స్టీలుప్లాంటు తదితర కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖల్లో హిందీ భాష అమలు తీరుతెన్నులు, భాషాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. ఎఫ్ఎస్ఐ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును నేవల్ డాక్‌యార్డు జనరల్ మేనేజరు కమొడోర్ అజమతుల్లాఖాన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రత్యేక అతిథులుగా డాక్టర్ లలన్‌కుమార్, వీరేంద్రకాజీ (స్టీలుప్లాంట్) తదితరులు పాల్గొనగా అరుణ్ త్రివేది వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఐఎంఏ నగర శాఖ ఎన్నిక

గురుద్వారా, న్యూస్‌టుడే: ఐఎంఏ విశాఖపట్నం శాఖ ఎన్నికలు మంగళవారం సీతమ్మధార లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో జరిగాయి. అధ్యక్షులుగా డాక్టర్ వి.వాణి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.పి.జగదేశ్వరరావు, ఎం.సుబ్రహ్మణ్యం శర్మ, ఎం.వి.ఎస్.ఎస్ భాపరావు, కార్యదర్శిగా డాక్టర్ ఎం.వి.వి. మురళీమోహన్ తదితరులు ఎన్నికయ్యారు.

తనయుడి అంత్యక్రియలకు హాజరై తనువు చాలించిన తల్లి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కుమారుడు మృతి చెందడంతో కడసారి చూసేందుకు వచ్చిన తల్లి తనువు చాలించిన విషాద ఘటన తెలంగాణలోని కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన పసుపులేటి నరేందర్ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. తల్లి సులోచన(80) మరో కుమారుడు కృష్ణ కుటుంబంతో కలిసి ఏపీలోని వైజాగ్‌లో ఉంటున్నారు. మంగళవారం ఇల్లెందుకు వచ్చిన ఆమె అచేతన స్థితిలో ఉన్న కుమారుడిని చూసి తట్టుకోలేకపోయింది. నరేందర్ అంత్యక్రియలు ప్రారంభమవుతుండగా ఏడుస్తూ కుప్పకూలారు. కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసి ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన కొంతసేపటికే మృతి చెందింది. కుమారుడి అంత్యక్రియలు జరగ్గా బుధవారం సులోచన అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు, బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా సీతారామటాకీసు వెనుక ఖాసీ ఆశీష్అసిర్ ఖానాలో మొహరంను వీరి కుటుంబ సభ్యులు మూడు తరాలుగా నిర్వహిస్తున్నారు. ఆ వేడుకకు నాలుగు నెలల క్రితం కుటుంబ సభ్యులంతా కలిశారు.

28న ఉక్కులో ధర్నా

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 28న ఉక్కులో నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. 28న ఉక్కు ప్రధాన పరిపాలన భవనం కూడలిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా ఉంటుందన్నారు. ధర్నాకు సంబంధించి 24న గోడపత్రిక విడుదల, 26న కరపత్రాల పంపిణీ చేస్తామన్నారు. కార్మిక నాయకులు డి. ఆదినారాయణ, జె.రామకృష్ణ, కె.ఎస్.ఎన్.రావు, ఎన్.రామచంద్రరావు, కె.రమణ, వై.టి.దాసు, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ఉక్కులో పనులు ప్రారంభించాలని ధర్నా

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలో నిలిచిపోయిన టెండర్లను వెంటనే పిలిచి, పనులు ప్రారంభించాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఈడీ(వర్క్స్)కార్యాలయం ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒప్పంద కార్మికులకు వైద్య పరీక్షలు నిలిపేయాలని, జీతాలు చెల్లించాలన్నారు. అలాగే టెండర్లు సకాలంలో పూర్తి చేయకపోవడంతో సుమారు 500 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి, రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఉక్కు యాజమాన్యం వెంటనే స్పందించాలన్నారు. అనంతరం డీజీఎం(హెచ్ఆర్)కు వినతి అందించారు. కార్మిక నాయకులు ఒ.వి.రావు, జి.శ్రీనివాస్, సోమరాజు, ఎన్.రమణ, వంశీ, బొడ్డు రాజేష్, వి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

ఉపాధ్యాయుల వినూత్న నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తిస్తున్న అన్ని రకాల ఉత్తర్వులు వర్తింపచేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం డీఈఓ కార్యాలయం ముందు మోకాళ్ల మీద కూర్చొని నిరసన తెలిపారు. ప్రమోషన్లు, బదిలీలు రెగ్యులర్‌గా నిర్వహించాలని, మున్సిపల్ టీచర్లకూ అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. అనంతరం డీఈఓ చంద్రకళకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. నిరసనలో చుక్క సత్యం, కె.రాంబాబు, మహ్మద్, టి.జగన్, సంతోషి, జి.అప్పలరాము, ఎం.మురళీ, ఉషారాణి, శాంతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగదు.. అవస్థలు తప్పవు..

పదిహేనేళ్లయినా కదలిక లేని పెందుర్తి బీఆర్‌టీఎస్ విస్తరణ



పెందుర్తి కూడలిలో అసంపూర్తిగా బీఆర్‌టీఎస్ విస్తరణ

పెందుర్తి, న్యూస్‌టుడే

విశాఖ నగరానికి ముఖద్వారంగా ఉన్న పెందుర్తి కూడలి ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటోంది. మన్యం, విజయనగరం జిల్లాల నుంచి నగరానికి వచ్చే వారు పెందుర్తి మీదుగానే ప్రయాణిస్తుంటారు. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం అరకు వెళ్లే పర్యాటకులు పెందుర్తి కూడలి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ఈ కూడలి వాహనాల రద్దీతో పాటు వివిధ అవసరాల కోసం పెందుర్తి వచ్చే ప్రజలతో సందడిగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన పెందుర్తి కూడలిని అనుసంధానిస్తూ తలపెట్టిన బీఆర్‌టీఎస్ రహదారి విస్తరణ పదిహేనేళ్లయినా నేటికీ అసంపూర్తిగా మిగిలిపోవడంతో అవస్థలకు నిలయంగా మారుతోంది.

★ **అక్కడ పరిష్కారం.. ఇక్కడ నిర్లక్ష్యం**

శివారు ప్రాంతాల ప్రజలు అతివేగంగా నగరానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా 2007లో బీఆర్‌టీఎస్(బస్ రాపిడ్ ట్రాన్స్‌పోర్టు సర్వీసు) పేరిట పెందుర్తి, సింహాచలం కారిడార్ల నిర్మాణానికి జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. తొలి నుంచి పలు వివాదాలతో ఆగుతూ సాగుతూ కొనసాగింది. మొత్తం రహదారి పూర్తికాగా పెందుర్తి పాత పీహెచ్‌సీ కూడలి నుంచి పాత పెందుర్తి వరకు విస్తరణ అసంపూర్తిగా నిలిచిపోయింది. స్థల సేకరణలో పలువురు తమ ఆస్తులను కోల్పోవడానికి అంగీకరించక న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ఇదే విధంగా పంచగ్రామాల భూసమస్య కారణంగా అడివివరంలో సింహాచలం కారిడార్ నిర్మాణం నిలిచిపోవడంతో గతేడాది జీవీఎంసీ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి నిర్మాణం పూర్తి చేసింది. పెందుర్తిలో మాత్రం వివాదాల పరిష్కారంపై జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు పలుకుబడి కలిగిన వ్యక్తుల స్థలాలు రోడ్డుకు ఇరువైపులా ఉండటంతో విస్తరణ జరగకుండా రాజకీయ ఒత్తిళ్లతో కాలయాపన జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.



అసంపూర్తి మార్గంలో వాహనాల రద్దీ

భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు

పెందుర్తి పరిసర ప్రాంతాలు రోజు రోజుకు విస్తరిస్తున్నాయి. ఇటీవల పెందుర్తి మండలంలోని పదిహేను గ్రామ పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేస్తారన్న ప్రచారం కూడా ఊపందుకుంది. ఇప్పటికే గ్రామాల్లో సైతం స్థిరాస్తి వ్యాపారం బాగా పెరిగి నివాసాలు, జనాభా వృద్ధి చెందుతోంది. మరోవైపు అరకు, అనంతగిరి, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ సమీకరణాల నేపథ్యంలో బీఆర్‌టీఎస్ విస్తరణ సత్వరమే పూర్తి చేయకుంటే భవిష్యత్తులో అవస్థలు తప్పవని నిపుణులు పేర్కొంటున్నారు. పాత పీహెచ్‌సీ నుంచి పెందుర్తి కూడలి వరకు సుమారు పావు కిలోమీటరు రహదారి విస్తరణ జరగలేదు. దీంతో సేవామార్గాలు కుదించుకుపోయాయి. తరచూ ప్రమాదాలు జరగడంతో పాటు ట్రాఫిక్ అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులకు విధి నిర్వహణ కత్తి మీద సాములా మారింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం, జీవీఎంసీ ఉన్నతాధికారులు రహదారి విస్తరణపై దృష్టిసారించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనాథ బాలలకు రూ.3.25 లక్షల సాయం

గాజువాక, న్యూస్‌టుడే : సామాజిక బాధ్యతగా సౌత్ ఏసియా ఎల్‌పీజీ ప్రైవేటు సంస్థ మంగళవారం గాజువాక శ్రీనగర్‌లోని డిజైర్ సొసైటీ హెచ్ఐవీ, ఎయిడ్స్ అనాథ పిల్లల సొసైటీకి రూ.3,25,500 విరాళం అందించింది. సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధి పి.లక్ష్మణకు సంస్థ సీఎఫ్ఓ వికాస్ వర్మ విరాళ చెక్కు అందించారు.



సొసైటీ ప్రతినిధి లక్ష్మణ్‌కు చెక్కు అందజేస్తున్న సీఎఫ్ఓ వికాస్ వర్మ

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్‌డ్	206	240
స్కిన్‌లెస్	234	250

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

బాలిక అదృశ్యం

సబ్బవరం, న్యూస్‌టుడే : సబ్బవరం మండలం (88వ వార్డు) గంగవరానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సబ్బవరం సీఐ పిన్నింటి రమణ చెప్పిన వివరాల ప్రకారం.. గంగవరానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. ఈనెల 19న ఉదయం స్కూలుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

పెందుర్తి, న్యూస్‌టుడే

సమస్య: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి దొగ్గవానిపాలెం రాడివారికల్లాలు ప్రాంతంలో 217బి/4 స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగక ఇబ్బంది పడుతున్నాం.
–కె.మురళి, దొగ్గవానిపాలెం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమాధానం: వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం.
–శివరామ్ ప్రసాద్, ఏఈ, 96వ వార్డు

శారదా పీఠాధిపతిపై ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర గెడ్డ స్థలాన్ని ఆక్రమించి శారదాపీఠం నిర్మించారని, పీఠం ముందు భాగంలోనూ రహదారి స్థలం ఆక్రమించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మంగళవారం పెందుర్తి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్‌కు కూడా ఫిర్యాదు చేశారు. జిల్లా తెదేపా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, బీసీ సెల్ నాయకులు దువ్వి పరమేశ్వరరావు, పీతల అప్పారావు, కె.నరేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించరూ..

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ వుడాకాలనీ పరిసర ప్రాంతాల్లో శ్మశానవాటిక లేకపోవడంతో సుమారు పది కాలనీల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని స్థానికులు వాపోయారు. ఈ నేపథ్యంలో శ్మశాన వాటిక నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరుతూ ఇటీవల కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లను కలిశారు. వారి సూచన మేరకు మంగళవారం పెందుర్తి తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు విన్నకోట రాము నేతృత్వంలో కాలనీవాసులు ఎం.వి.ఆర్.పాత్రుడు, కె.వి.ప్రసాదరావు, పి.గోవిందరావు, కృష్ణారావు తదితరులు తహసీల్దార్‌ను కలిశారు.

ప్రభుత్వ భూముల జోలికి వస్తే క్రిమినల్ చర్యలు తప్పవు

సబ్బవరం, న్యూస్‌టుడే : సబ్బవరం మండలంలో ప్రభుత్వ భూముల జోలికి ఎవరు వెళ్లినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలమేరకు సబ్బవరం మండలంలో ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఆరుగురు వ్యక్తులు ఈ భూమి ఆక్రమించి ఉండగా వారిని తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన వివరించారు. ఎవరూ ప్రభుత్వ భూముల జోలికి వెళ్లవద్దని ఆయన తెలిపారు. ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సబ్బవరం తహసీల్దారు చిన్ని కృష్ణ, ఆర్ఐ వీరయ్య

గుంతలు తేలి.. అంచులు చెదిరి..!
సింహాద్రి ఎన్టీపీసీ రహదారి దుస్థితి

పరవాడ, న్యూస్‌టుడే

పరవాడ మండలం వెన్నెలపాలెం నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే రహదారి ఎక్కడికక్కడ ధ్వంసమైంది. పలు ప్రాంతాల్లో గుంతలు పడడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షం పడితే రహదారి చిత్తడిగా మారడంతో పాటు నీరుచేరి గుంతలు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారి వెంబడి వెన్నెలపాలెం పరిసర గ్రామాల ప్రజలతో పాటు ఎన్టీపీసీకి వెళ్లే కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. గత వైకాపా ప్రభుత్వంలో రహదారి దుస్థితికి చేరినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. రహదారి అంచులు ధ్వంసమయ్యాయని, మలుపులు కూడా ఉండడంతో ప్రమాదాలబారిన పడుతున్నామని ద్విచక్రవాహన చోదకులు వాపోతున్నారు. ఈ మార్గంలో కల్వర్టులకు రక్షణ గోడలు లేవని, ఏ మాత్రం అదుపు తప్పినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కూరగాయల మార్కెట్ వద్ద రహదారిపై గుంతలు


ఇటుకబట్టీల వద్ద దెబ్బతిన్న అంచులు


సింహాద్రి ఎన్టీపీసీ సమీపంలో ఇలా..

పెందుర్తి మీదుగా బస్సులు నడపాలని వినతి

పెందుర్తి, న్యూస్‌టుడే: సింహాచలం డిపో నుంచి పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి మీదుగా విజయవాడ వైపు బస్సు సర్వీసులు నడపాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. పెందుర్తి నుంచి విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఈ నేపథ్యంలో పెందుర్తి మీదుగా బస్సులు నడిపితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు.


ఛైర్మన్ నారాయణరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

'ఉల్లాస్' పథకంపై అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు సబ్బవరం మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం అండర్ స్టాండింగ్ ఆఫ్ లాంగ్‌లైఫ్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) అనే పథకం మీద అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీడీవో పి.పద్మజ అధ్యక్షత వహించారు. పథకం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.లక్ష్మణరావు, సెర్ప్ ఏరియా కోఆర్డినేటర్ ఎ.రాజేశ్వరి, సీడీపీవో వి.లలితకుమారి, ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన మహిళా సమాఖ్య సభ్యులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సబ్బవరం, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ పేర్కొన్నారు. ఆమె మంగళవారం సబ్బవరం మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. వర్షాలు పడే సూచన ఉన్న కారణంగా గ్రామ కార్యదర్శులు వారి ప్రధాన కేంద్రంలో ఉండి ఎప్పటి సమాచారం అప్పుడు మండల కేంద్రానికి చేరవేయాలన్నారు. ఇప్పటికే సబ్బవరం తహసీల్దారు కార్యాలయంలో తుపాను కంట్రోల్‌రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏవో నారాయణరావు, ఈవోపీఆర్డీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.


సబ్బవరం మండలంలోని గ్రామ కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ

వేగ నిరోధకాలపై రేడియం రంగులు ఏవీ?

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ మండల పరిషత్తు కూడలి, బొంకులదిబ్బ, గండివారివీధి తదితర ప్రాంతాల్లో వేగనిరోధకాలకు రంగులు లేని కారణంగా వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. కొన్నాళ్ల క్రితం ఆయా ప్రాంతాల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేశారు. వాటిపై తెల్ల రేడియం రంగు వేయకుండా వదిలేశారు. దీంతో రాత్రుళ్లు వాహనచోదకులకు వేగనిరోధకాలు కనిపించకపోవడంతో అదుపు తప్పి కిందపడిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: అర్హులైన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పెందుర్తి ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ వి.అర్జునరావు సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన సదస్సు జరిగింది. కళాశాల కార్యదర్శి టి.థియోఫిలస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీటీ అర్జునరావు హాజరై విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ విషయంలో 18ఏళ్లు నిండిన యువత వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డీటీ అర్జునరావు

రైతుల ప్రయోజనానికే రెవెన్యూ సమావేశాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: రైతుల ప్రయోజనం కోసమే గ్రామాల్లో రెవెన్యూ సమావేశాలు నిర్వహిస్తున్నామని సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణ అన్నారు. మంగళవారం సబ్బవరం మండలం చింతగట్ల అగ్రహారంలో గ్రామ రెవెన్యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన రీసర్వేలో అనేక తప్పులు దొర్లినట్లయితే వాటిని సవరించుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, రీసర్వే ఆర్ఐ వై.గణేష్, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దారు చిన్ని కృష్ణ

వ్యక్తిగత ఎంపిక ప్రతి ఒక్కరి హక్కు

సబ్బవరం, న్యూస్‌టుడే : వ్యక్తిగత ఎంపిక అనేది ప్రతి ఒక్కరి హక్కు అని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. డీఎస్ఎన్ఎల్‌యూలో మంగళవారం ఫ్యాషన్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్‌లా అధ్యయన కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యక్తిగత హక్కులు, ఫ్యాషన్ ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)ఎ కింద వ్యక్తిగత ఎంపిక, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కు కల్పించబడిందన్నారు. ప్రముఖ న్యాయవాది నమితాషా మాట్లాడుతూ.. ప్రసిద్ధ సంస్థల సృజనాత్మకతను ఇతరులు దొంగిలించినట్లయితే.. అసలైన డిజైనర్ల ప్రయోజనాలను ఎలా పరిరక్షించాలనేదానికి నిర్దిష్ట చట్టాలు లేవన్నారు. న్యాయస్థానాలు ఎలా వివాదాలను పరిష్కరిస్తాయో ఆమె వివరించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ జోగినాయుడు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది నమితాషాను సత్కరించారు.



సమావేశానికి హాజరైన విద్యార్థులు, నమితా షాను సత్కరిస్తున్న ఉపకులపతి సూర్యప్రకాశరావు

వృద్ధాశ్రమానికి గుర్తు తెలియని మహిళ అప్పగింత

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం సరిపల్లి ప్రాంతంలో కొన్నాళ్లుగా రోడ్లపై సంచరిస్తున్న గుర్తు తెలియని మహిళను పెందుర్తి పోలీసులు వృద్ధాశ్రమంలో చేర్పించారు. సుమారు 35 ఏళ్ల వయసున్న మహిళ సరిపల్లి పరిసర ప్రాంతాల్లో రాత్రి, పగలు రోడ్డుపై ఉండడాన్ని గమనించిన కొత్తవలసకు చెందిన బత్తి ఉషశ్రీ పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ పెందుర్తి లయోలా వృద్ధాశ్రమంలో ఆమెకు ఆశ్రయం కల్పించాలని నిర్వాహకులను కోరారు. ఈ మేరకు హెచ్‌సీ దేవుడు, ఉషశ్రీ సంబంధిత మహిళను ఆశ్రమ నిర్వాహకులకు అప్పగించారు.


ఆశ్రమ నిర్వాహకులకు అప్పగిస్తున్న పోలీసులు



ఆందోళన చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

'కార్మికులను రోడ్డున పడేయడం దారుణం'

పరవాడ, న్యూస్‌టుడే: అచ్యుతాపురం అభిజిత్ కంపెనీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పరవాడ సినిమాహాల్ కూడలిలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థలో విధించిన అక్రమ లేఆఫ్‌లను ఎత్తివేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. వెయ్యి మంది కార్మికులను రోడ్డున పడేయడం దుర్మార్గమన్నారు. కార్మికులకు విధుల్లోకి తీసుకోని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గెదేల అప్పారావు, నాయుడు, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

లంకెలపాలెం(పరవాడ)న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల ఖోఖో పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. పోటీలను ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్‌రావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 320 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారు వచ్చే నెల 6, 7 తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఎస్ఎంసి ఛైర్మన్ గుర్రం అప్పలరాజు, పరిశీలకులు రాజు, పీడీలు కేఎం నాయుడు, కిరణ్, లక్ష్మి, తులసీ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్‌రావు తదితరులు, ఖోఖో ఆడుతున్న విద్యార్థులు


అతిథుల నుంచి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటున్న సాయిరాం

సంగీత, సాహిత్యాల్లో ప్రతిభ

పరవాడ, న్యూస్‌టుడే: శ్రీశ్రీ కళావేదిక, అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు కళా జాతర కార్యక్రమంలో పరవాడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం సీహెచ్‌వో సాయిరాం ప్రతిభ చూపారు. సంగీతం, సాహిత్యంలో ఆయన చూపిన ప్రతిభను మెచ్చుకుని నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. మంగళవారం పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణిలు హారిక, జయశ్రీ, కరిష్మా తదితర వైద్య సిబ్బంది సాయిరాంకు అభినందనలు తెలిపారు.

శునకాల దాడులతో బెంబేలు

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా వీధుల్లో సంచరిస్తుండడంతో వృద్ధులు, పిల్లలు ఇంటి నుంచి బయటికి రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రుళ్లు ద్విచక్రవాహనదారులను వెంబడించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, మాంసం దుకాణాల వద్ద లభించే వ్యర్థాలను తింటూ ఈ ప్రాంతంలో తిష్ట వేశాయి. పొలాల్లోని పంటలను పాడు చేయడంతో పాటు ఆవు, గేదె దూడలపై దాడులు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

ఎట్టకేలకు భవిత కేంద్రానికి ప్రహరీ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్తు కూడలి సమీపంలోని భవిత కేంద్రానికి ఎట్టకేలకు ప్రహరీని నిర్మించారు. ఈ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యను భవిత కేంద్రం ప్రతినిధులు సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు దృష్టికి తీసుకెళ్లగా, వారు స్పందించి సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.7లక్షలు కేటాయించారు. ఆ మొత్తంతో కొద్దిరోజుల క్రితం ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించి ప్రస్తుతం పూర్తి చేశారు.


భవిత కేంద్రానికి నిర్మించిన ప్రహరీ

23న బొకారో ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: సాంకేతిక కారణాలతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు (రీ షెడ్యూల్) వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీటి బెంగళూరు-అగర్తలా(12503) రైలు ఈనెల 22 ఉదయం 10.15 గంటలకు బదులు 9.45 గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు.. అల్పూజా-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 23న ఉదయం 6 గంటలకు బదులు 4.10గంటలు ఆలస్యంగా ఉదయం 10.10 గంటలకు బయలు దేరేలా మార్పు చేశారు.

ఆదాయపన్ను నిధులు వెనక్కివ్వాలని వినతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి మినహాయించిన ఆదాయ పన్ను నిధులను వెనక్కి ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ వద్ద ఆందోళన నిర్వహించి కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులు ఆదాయపన్ను పరిధిలోకి రాకపోయినా జీతాల నుంచి మినహాయించారన్నారు. వెనక్కి వచ్చిన నిధులను కార్మికుల ఖాతాలలో జమ చేయాల్సి ఉండగా, మహిళా సంఘాల ఖాతాల్లో జమచేశారన్నారు. తక్షణమే నిధులు వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.


కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

విద్యుత్ వైర్లకు తగులుతున్న కేబుల్ స్తంభం


వరలక్ష్మీనగర్‌లో విద్యుత్ వైర్లకు దగ్గరగా ఉన్న కేబుల్‌వైరు స్తంభం


కేబుల్ స్తంభానికి తాకుతున్న విద్యుత్ వైరు

వేపగుంట, న్యూస్‌టుడే : జీవీఎంసీ 95వ వార్డు వరలక్ష్మీనగర్‌లో ఓ ప్రయివేటు కేబుల్‌స్తంభం విద్యుత్ వైర్లకు దగ్గరగా ఉండి స్థానికులను భయాందోళనకు గురిచేస్తుంది. విద్యుత్ వైర్లు గాలి వేసినప్పుడల్లా కేబుల్ స్తంభానికి తగులుకొని నిప్పురవ్వలు ఎగజిమ్ముతూ కాలనీవాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు ఆ కేబుల్ యాజమాన్యంతో సంప్రదించి కేబుల్ స్తంభాన్ని మార్పించడం, లేదా విద్యుత్ వైర్ల దిశను మార్చడమైనా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మురుగు గుంతలు లేకుంటే ఇబ్బందే సుమా!

ప్రహ్లాదపురం (వేపగుంట), న్యూస్‌టుడే : పాత గోశాల కూడలి నుంచి ప్రహ్లాదపురం వెళ్లే ప్రధాన రహదారిలో మురుగు నీరు పోయే ప్రధాన కాలువలు లేకపోవడంతో స్థానికులు మురుగు గుంతలు తవ్వుకుంటున్నారు. ఆ గుంతలు తవ్వకుంటే ఇళ్లలోని వాడుక నీరు రహదారిపైనే ప్రవహించాల్సి వస్తుంది. పెద్ద పెద్ద రహదారులు నిర్మించిన అధికారులు వాటికి పక్కన డ్రైనేజీలు నిర్మించకపోవడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. మురుగు గుంతలు నిండిపోయిన తరువాత మురుగు బయటకు పొంగిపొర్లుతుందని దీంతో వాహనదారుల రాకపోకలకు చాలా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు ఇక్కడి పరిస్థితిని పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పాత గోశాల నుంచి ప్రహ్లాదపురం రహదారిలో గుంతలో చేరిన మురుగు నీరు

తనను తాను

మనువాడిన బ్రిట్నీ!



మిసిసిపీ: అమెరికన్ పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ (42) గత ఆదివారం ఇన్‌స్టాగ్రాం వేదికగా పంచుకొన్న ఓ పోస్టు అందరినీ కలవరపాటుకు గురిచేసింది. 30 ఏళ్ల శాం అస్గరీతో 14 నెలలు కొనసాగిన బ్రిట్నీ వివాహబంధం ఇటీవలే ముగిసింది. గత మే నెలలో ఈ జంట విడాకుల ఒప్పందానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పెళ్లిగౌను ధరించి బ్రిట్నీ ఇన్‌స్టాలో చేసిన పోస్టు అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. "నన్ను నేను పెళ్లి చేసుకున్నా. ఇది తెలివితక్కువ పనిగా మీకు అనిపించవచ్చు. కానీ, నా జీవితంలో నేను చేసిన అద్భుతమైన పనిగా దీన్ని భావిస్తున్నా" అంటూ ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టుతోపాటు పంచుకొన్న వీడియోలో నవవధువులా నిలబడిన బ్రిట్నీ పక్కన వరుడు ఎవరూ లేరు. ఎటువంటి వివరణ లేకుండా ఖాళీగా ఉన్న చర్చి ఫొటో షేర్ చేసింది. ఒంటరిగా హనీమూన్‌కు బయలుదేరుతున్నట్లు విమానం పక్కన నిలబడి ఉన్న మరో పోస్టులో "టక్స్ అండ్ కేక్స్, ఇదిగో నేను వచ్చేశా" అని బ్రిట్నీ వ్యాఖ్య జోడించింది. టక్స్ అండ్ కేక్స్ దీవులు అట్లాంటిక్ సముద్రంలో ఉన్నాయి.

మరో 80 విమానాలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: విమానయాన సంస్థలకు గత కొద్దిరోజులుగా వస్తున్న బాంబు బెదిరింపులు ఆగడంలేదు. సోమవారం నుంచి మంగళవారం మధ్య 24 గంటల్లో దాదాపు 80 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు హెచ్చరికలు వచ్చాయని 'బాంబు బెదిరింపుల మూల్యాంకన కమిటీ' ప్రకటించింది. దీంతో 24 గంటల్లో బెదిరింపులు అందుకున్న విమానాల సంఖ్య 80కి చేరుకుంది. గత తొమ్మిది రోజుల్లో 170 విమానాలకు కలిగిన అంతరాయం వల్ల రూ.600 కోట్ల నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు తెలిపారు.



పెన్సిల్వేనియా గెలవాల్సిందే!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా మారిన రాష్ట్రం

వాషింగ్టన్: అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన పెన్సిల్వేనియా ప్రస్తుతం జరుగుతున్న అధ్యక్ష ఎన్నికల్లోనూ అత్యంత కీలకంగా మారింది. అధ్యక్షులుగా ఎన్నిక కావాలంటే ఈ రాష్ట్రంలో తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య ఈ రాష్ట్రంలో ఉత్కంఠ భరిత పోరు సాగుతోంది. పెన్సిల్వేనియాలో 19 ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లున్నాయి. అత్యధికంగా కాలిఫోర్నియాలో 54 ఓట్లున్నాయి. ఇది డెమోక్రాట్లకు కంచుకోట. రిపబ్లికన్లు బలంగా ఉన్న టెక్సాస్‌లో 40 ఓట్లున్నాయి.



- దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో గతంలో అధ్యక్ష అభ్యర్థులకు వచ్చిన ఓట్ల ఆధారంగా ట్రంప్, హారిస్‌లకు వచ్చే ఓట్లను రాజకీయ నిపుణులు అంచనా వేశారు.
- ఏడు కీలక రాష్ట్రాల్లోని ఓట్లపైనే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఇందులో ఆరిజోనా (11), విస్కాన్సిన్ (10), మిషిగన్ (15), పెన్సిల్వేనియా (19), జార్జియా (16), నార్త్ కరోలినా (16) ఉన్నాయి.
- వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థులు పెన్సిల్వేనియాపై దృష్టి సారించారు. ఇక్కడ తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.
- ఓటర్లను ఆకట్టుకునేందుకు ట్రంప్, హారిస్‌కు సంబంధించిన వేల మంది వాలంటీర్లు పెన్సిల్వేనియాలో మకాం వేశారు.
- పెన్సిల్వేనియాలో గెలవకుండా 270 ఎలక్టోరల్ ఓట్లు సాధించడం అసాధ్యమని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.
- 270టువిన్.కామ్ వెబ్‌సైట్ అంచనా ప్రకారం.. హారిస్‌కు 226 ఓట్లు, ట్రంప్‌నకు 219 ఓట్లు రావొచ్చని అంచనా.



1 శాతం అటూఇటూ..

2016 ఎన్నికల్లో ట్రంప్ కేవలం 1శాతం ఓట్లతో పెన్సిల్వేనియాలో విజయం సాధించారు. అదే 1 శాతం ఓట్ల తేడాతో 2020లో ఈ రాష్ట్రాన్ని కోల్పోయారు.

- 2024 ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్లు ఈ రాష్ట్రం ఉంది. దాదాపుగా టాస్ వేసినట్లుగానే ఫలితం ఉండవచ్చని అంటున్నారు.
- కీలక రాష్ట్రం కావడంతో ట్రంప్, హారిస్‌లు.. డబ్బు, సమయం, శక్తినంతా ఇక్కడే ధారపోస్తున్నారు. వాణిజ్య ప్రకటనలూ ఇక్కడే ఎక్కువగా ఇస్తున్నారు.
- పెన్సిల్వేనియా ఓటర్లను ఆకట్టుకోవడానికి సోమవారం నుంచి 21 మంది ప్రముఖులతో రిపబ్లికన్ పార్టీ బస్సు యాత్ర ప్రారంభించింది. ఇందులో భారతీయ అమెరికన్ కాష్ పటేల్ ఉన్నారు.
- రెండు పార్టీలకు చెందిన దాదాపు 50 సభలు గత 3 నెలల్లో పెన్సిల్వేనియాలో జరిగాయంటేనే ఇక్కడ పోటీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.
- ప్రతి 4 డాలర్లలో 1 డాలరును ఈ రాష్ట్రంలోనే ప్రకటనల కోసం రెండు పార్టీలు ఖర్చు చేశాయి.
- ట్రంప్ ఇటీవల మెక్ డొనాల్డ్‌లో అక్కడి సిబ్బందిలా దుస్తులు వేసుకుని పని చేసింది ఈ రాష్ట్రంలోనే కావడం విశేషం.

హెజ్‌బొల్లా రాకెట్ల వర్షం

కూల్చేసిన ఇజ్రాయెల్ ● నెతన్యాహు సేనల దాడిలో 13 మంది మృతి



బీరుట్‌లో ధ్వంసమైన భవనాల వద్ద సహాయక చర్యలు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ మధ్య ప్రాంతంపై హెజ్‌బొల్లా మంగళవారం రాకెట్లతో విరుచుకుపడింది. వాటిని ఇజ్రాయెల్ అడ్డుకుంది. ఒక రాకెట్ నిర్మానుష్య ప్రాంతంలో పడింది. ఈ దాడుల్లో ఒక రిజర్విస్టు సైనికుడు మృతి చెందాడు. దాడుల నేపథ్యంలో 10 లక్షల మంది ఇజ్రాయెలీలు సురక్షిత బంకర్లలో తలదాచుకున్నారు. విమాన సేవలకు కొంత అంతరాయం కలిగింది. మరోవైపు సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 13 మంది లెబనాన్ వాసులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఇటు పశ్చిమాసియాలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్.. కాల్పుల విరమణకు అవకాశాలు స్వల్పమేనని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా మంగళవారం ఇజ్రాయెల్‌లోని జనసమర్థ ప్రాంతాలపై రాకెట్ దాడులు చేసింది. అయితే ఎటువంటి నష్టం జరగలేదని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. బ్లింకెన్ ఇజ్రాయెల్‌కు రావడానికి కొద్ది గంటల ముందు ఈ దాడులు జరిగాయి. 5 ప్రొజెక్టైల్స్‌ను లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించిందని, వాటిలో ఒక్కటి మినహా అన్నింటినీ క్షిపణి రక్షణ వ్యవస్థ అడ్డుకుందని ఇజ్రాయెల్ తెలిపింది. ఒకటి నిర్మానుష్య ప్రాంతంలో పడిందని వెల్లడించింది. దాడుల కారణంగా బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. బీరుట్‌లోని ప్రధాన ఆసుపత్రి ప్రాంతంలో సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 13 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్యశాఖ ప్రకటించింది. 57 మంది గాయపడ్డారని తెలిపింది.

★ లెబనాన్, సిరియా సరిహద్దులోని జాతీయ రహదారిపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. సిరియాలోని ప్రాంతంపై మంగళవారం ఈ దాడి జరిగినట్లు జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది.

రద్దీ ప్రాంతంపై ఇజ్రాయెల్ దాడి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌కు దక్షిణాన ఉన్న రద్దీ ప్రాంతంపై మంగళవారం ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ ప్రాంతంలోనే శరణార్థి శిబిరం కూడా ఉంది. హెజ్‌బొల్లా స్థావరాలుగా పేర్కొంటూ రెండు భవనాలపై ఇజ్రాయెల్ బాంబులతో దాడి చేసింది. ఈ దాడుల్లో మరణాలపై వివరాలందలేదు. ఫ్రాన్స్ రాయబారి ఇంటికి దగ్గరలోనే ఈ దాడి జరిగింది.

వక్ఫ్ బిల్లుపై జేపీసీ భేటీ రసాభాస

- గాజుసీసా పగలగొట్టి ఛైర్మన్ వైపు విసిరిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ
- ఎంపీ చేతికి గాయం..



చేతికి కట్టుతో కల్యాణ్ బెనర్జీ

దిల్లీ: కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. ప్రారంభమైన కొద్దిసేపటికే ఎంపీలు వాగ్వాదానికి దిగారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తనకు ఎదురుగా నీళ్ల కోసం పెట్టిన గాజుసీసాను టేబులుకేసి కొట్టగా ఆయన చేతివేళ్లకు గాయమైంది. అనంతరం పగిలిన బాటిల్‌ను ఛైర్మన్ వైపు కల్యాణ్ విసిరారు. ఫలితంగా సమావేశం వాయిదా పడింది. బెనర్జీకి పార్లమెంటు ఆవరణలోని డిస్పెన్సరీలో ప్రథమచికిత్స చేసి కుట్లు వేశారు. ఈ వ్యవహారాన్ని పార్లమెంటరీ కమిటీ తీవ్రంగా పరిగణించింది. భాజపా సభ్యుడు నిశికాంత్ దుబే తీర్మానం ప్రవేశపెట్టగా, 10-8 ఓటింగుతో ఆమోదించిన కమిటీ కల్యాణ్ బెనర్జీని సమావేశాల నుంచి ఒకరోజు సస్పెండు చేస్తూ నిర్ణయం తీసుకొంది. భాజపా ఎంపీ జగదాంబికా పాల్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశం ఒడిశాకు చెందిన రిటైర్డ్ జడ్జీలు, న్యాయవాదుల అభిప్రాయాలు వింటుండగా ఈ వివాదం తలెత్తింది.

వదిలేస్తే.. రేపు తుపాకీతో వస్తారు: పాల్

జేపీసీ సమావేశంలో జరిగిన దాడి నుంచి తాను త్రుటిలో తప్పించుకొన్నట్లు ఛైర్మన్ జగదాంబికా పాల్ తెలిపారు. సభ్యులను ఇలా వదిలేస్తే రేపటి సమావేశానికి మరొకరు రివాల్వరుతో వస్తారని మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. బాటిల్‌ను ఛైర్మన్ వైపు విసరడం తన ఉద్దేశం కాదని కల్యాణ్ బెనర్జీ విచారం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



వైఫల్యాల తర్వాత బలంగా పుంజుకోండి

జీవితం అంటే వైఫల్యాలను తప్పించుకోవడం కాదు! ఎన్ని వైఫల్యాలు ఎదురైనా తిరిగి బలంగా పుంజుకోవడం!! గెలుపు, ఓటమి అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివి. ఓటమికి వెరవకుండా, ప్రతిరోజూ మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకుంటూ ముందుకెళ్లండి.

– డేవిడ్ లవ్‌జాయ్, పాడ్‌కాస్టర్

గుజరాత్‌లో అయిదేళ్లుగా నకిలీ కోర్టు!

- భూవివాదాలు లక్ష్యంగా తీర్పులు
- మోసగాడైన 'జడ్జి' అరెస్టు





అహ్మదాబాద్: ఉత్తుత్తి బ్యాంకులు.. పోలీసులు.. ఇపుడు ఏకంగా కోర్టులు కూడా ఈ జాబితాలో చేరాయి. గుజరాత్ రాజధాని నగరంలో గత అయిదేళ్లుగా "తీర్పులు" ఇస్తున్న నకిలీ కోర్టు గుట్టు రట్టయ్యింది. నకిలీ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి, న్యాయమూర్తిగా తీర్పులు ఇచ్చిన మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శామ్యూల్ అనుచరులే కోర్టు సిబ్బందిగా, న్యాయవాదులుగా నటించేవారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో నిజమైన కోర్టు వాతావరణాన్ని శామ్యూల్ సృష్టించాడని పోలీసులు తెలిపారు. అహ్మదాబాద్ సిటీ సివిల్‌కోర్టు రిజిస్ట్రారు నగరంలోని కరంజ్ పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు శామ్యూల్ ప్రభుత్వ భూమికి సంబంధించి 2019లోనే తన క్లయింట్‌కు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చాడు. తర్వాత ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో తన క్లయింట్ పేరును చేర్చాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ ఉత్తర్వును అమలుచేయాలని కోరుతూ శామ్యూల్ మరొక న్యాయవాది ద్వారా సిటీ సివిల్‌కోర్టులో అప్పీల్ చేశాడు. తాను జారీ చేసిన నకిలీ ఉత్తర్వులను కూడా ఈ పిటిషనుకు జత చేశాడు. ఆ ఉత్తర్వులు నకిలీవని కోర్టు రిజిస్ట్రారు గుర్తించడంతో శామ్యూల్ బండారం బయటపడింది.

● గత అయిదేళ్లుగా శామ్యూల్ నకిలీ కోర్టు నడుపుతోంది. సిటీ సివిల్‌కోర్టులో భూవివాదాల కేసులు పెండింగులో ఉన్న కక్షిదారులను గుర్తించి నిందితుడు వల పన్నేవాడు. ప్రభుత్వం నియమించిన అధికారిక మధ్యవర్తిగా పరిచయం చేసుకునేవాడు. తర్వాత పిటిషనర్లను తన 'కోర్టు'కు పిలిపించుకునేవాడు. అక్కడ ట్రైబ్యునల్ ప్రిసైడింగ్ అధికారిగా నటిస్తూ తన క్లయింట్లకు అనుకూలమైన తీర్పులు ఇచ్చి, ఉత్తర్వులను జారీ చేస్తాడు. వారి నుంచి సొమ్ము తీసుకునేవాడు.

అలా.. మూత పడింది..!

న్యూస్‌టుడే, అగనంపూడి


అగనంపూడి ఇసుక డిపో మూత పడింది. నిల్వలన్నీ ఖాళీ అవడంతో నెల రోజులుగా కార్యకలాపాలు నిలిచిపోయాయి. రీచ్‌ల నుంచి నేరుగా వినియోగదారులకే ఇసుక సరఫరా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో ఇక్కడి నిల్వ కేంద్రాన్ని మళ్లీ తెరిచే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. అయిదేళ్ల పాటు సేవలు అందించిన డిపో మూతతో, ఆయా పరిసరాలు ప్రస్తుతం బోసిపోయాయి.

విశాఖ జిల్లా పరిధి గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రజల అవసరాల కోసం గత వైకాపా హయాంలో అగనంపూడిలో ఇసుక డిపోను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కన స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఖాళీ స్థలాన్ని ఎంపిక చేశారు. రాజమహేంద్రవరం రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకొచ్చి ఇక్కడ నిల్వ చేసేవారు. వినియోగదారులకు కావాల్సిన మేర టన్నుల లెక్కన విక్రయాలు జరిపేవారు. ముందుగా రీచ్‌ల్లో తవ్విన ఇసుకను నిల్వ కేంద్రాలకు చేరవేసి, అక్కడ నుంచి వినియోగదారులకు సరఫరా చేసేవారు. ఈ విధానంలో ఎగుమతి, దిగుమతి, రవాణా ఛార్జీలతో ధరల భారం అధికంగా ఉండేది. ఇలా అయిదేళ్ల పాటు నిరంతరాయంగా కార్యకలాపాలు కొనసాగాయి.

అగనంపూడి ఇసుక డిపోలో నిలిచిన కార్యకలాపాలు

అమల్లోకొచ్చిన కొత్త పాలసీ

నాలుగు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని అమల్లోకి తీసుకొచ్చింది. డిపోల్లో నిల్వలన్నీ విక్రయించి, ఖాళీ చేశారు. ఇప్పుడు అంతర్జాలం ద్వారా బుక్ చేసుకున్న వినియోగదారులకు రీచ్‌ల నుంచి నేరుగా ఇంటి వద్దకే ఇసుక పంపేలా ఏర్పాట్లు చేశారు. దీంతో తక్కువ ధరకే ఇసుక లభ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇసుక బుకింగ్‌కు ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో నిల్వ కేంద్రంలో కార్యకలాపాలను నిలిపేశారు. ఇతర వాహనాలు డిపో లోపలకు వెళ్లకుండా ప్రవేశ మార్గాన్ని మూసేశారు.



ట్రాఫిక్ సమస్యకు తెర

హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి కూడలికి ఆనుకునే ఇసుక డిపో ఉంటోంది. ఇక్కడ కార్యకలాపాలు కొనసాగినంత కాలం వాహనాల రద్దీతో కూడలిలో తరచూ ట్రాఫిక్ స్తంభించేది. ఫార్మా ఉద్యోగులు, పరిసర గ్రామ ప్రజలు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు డిపోను శాశ్వతంగా మూసేయడంతో ట్రాఫిక్ సమస్యకు తెర పడినట్లైంది.



డిపో ప్రాంగణం

భారీ యంత్రం అక్కడే..!

ఇసుక డిపోలో బరువును తూచే భారీ యంత్రం నిరుపయోగంగా మారింది. గతంలో ఈ యంత్రంతో పాటు కార్యాలయం కోసం కంటైనర్ ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు అమర్చారు. సీసీ కెమెరాలు కొన్నాళ్లకే అదృశ్యమవగా, కంప్యూటర్‌తో పాటు, మిగిలిన పరికరాలను అధికారులు తరలించారు. బరువు యంత్రం, కంటైనర్‌ను డిపోలోనే వదిలేశారు.

స్థలాన్ని అప్పగించాలి

ఇసుక డిపో స్థలాన్ని తిరిగి ఉక్కు యాజమాన్యానికి అప్పగించాలని స్థానిక అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆ స్థలంలో మొక్కలు నాటి పార్కుగా అభివృద్ధి చేస్తే క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే రోగులు సేద తీరడానికి, ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని సూచిస్తున్నారు. ఆ దిశగా ఉక్కు అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం



తనిఖీలు జరుపుతున్న పోలీసు శునకం సీజర్

ఎం.వి.పి.కాలనీ, రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు రైల్వేస్టేషన్, బీచ్‌రోడ్డు, బస్ కాంప్లెక్సు వంటి ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు జరిపారు. దీనికి నార్కోటిక్ స్నిపర్‌డాగ్ సహకారం తీసుకున్నారు. రైల్వేస్టేషన్‌లో రవాణాకు సిద్ధంగా ఉంచిన 10.5 కిలోల గంజాయిని స్నిపర్‌డాగ్ సీజర్ గుర్తించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని రైల్వే పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీజర్‌ను, డాగ్ హ్యాండ్లర్ రామ్‌ప్రసాద్‌ను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

అండర్-19 జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలంలోని మహాత్మా జ్యోతిబా పులే ఏపీ బీసీ గురుకులంలో మంగళవారం అండర్-19 బాలబాలికల అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను విశాఖ జిల్లా అండర్-19 క్రీడల కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీలక్ష్మీ, పీడీలు సుధాకర్, సంధ్య నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఎంపిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డాక్టర్ భవానీ శంకర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాల పిల్లల విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.భవానీశంకర్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో గతంలో ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలపై డాక్టర్ భావనీ శంకర్ హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాల మేరకు మహారాణిపేట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేశారు. దీంతోపాటు సస్పెన్షన్ ఎత్తివేయాలన్న అభ్యర్థన మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

తాపీమేస్త్రి ఆత్మహత్య



మీసాల ఆనందరావు (పాతచిత్రం)

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిన్నయ్యపేట గ్రామానికి చెందిన మీసాల ఆనందరావు(32), భార్య, పిల్లలతో కలిసి పీఎంపాలెం సూర్య తులసీనగర్‌లో నివసిస్తున్నాడు. తాపీమేస్త్రి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆనందరావు మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తగాదాలు చోటు చేసుకున్నాయి. ఎంత చెప్పినా భర్తలో మార్పు రాకపోవడంతో ఇటీవల అత్త, మామలకు విషయం చెప్పి అతని భార్య, పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతడు మరింత మనస్తాపానికి గురయ్యాడు. ఈ పరిస్థితిలో సోమవారం రాత్రి తమ ఇంటి పక్కనున్న బంధువుల నివాసంలో పడుకుని మంగళవారం ఉదయం 6.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చేశాడు. పరదేశిపాలెంలో ఉంటున్న తల్లిదండ్రులు ఉదయం 8.30 గంటలకు కుమారుడి చరవాణికి ఫోన్ చేయగా స్పందించలేదు. వారు ఇంటికొచ్చి చూడగా ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో బోరున విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కనులపండువగా పైడితల్లి తెప్పోత్సవం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం సాయంత్రం కనులపండువగా సాగింది. ఆలయ సహాయ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తల్లి సేవకుల నేతృత్వంలో పెద్ద చెరువు పశ్చిమ భాగాన వైభవంగా జరిగింది. మధ్యాహ్నం వేద సభ, అమ్మవారికి స్నపన, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణతో కూడిన పల్లకిలో ప్రతిష్ఠించి, వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా గాడీఖానాకు తీసుకొచ్చారు. 5.30 గంటలకు రాజహంస ఆకారంలోని తెప్పపై తల్లి కొలువుదీరింది. దేవస్థానం సిబ్బంది, వేదపండితులు, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో మూడుసార్లు తెప్పను చెరువు చుట్టూ తిప్పారు.



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

అప్పన్న సన్నిధిలో వీఎంఆర్డీఏ కమిషనర్

సింహాచలం, న్యూస్‌టుడే: వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ మంగళవారం కుటుంబ సమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఏఈవోలు రమణమూర్తి, రాంబాబు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



విశ్వనాథన్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈవో రమణమూర్తి

అప్పన్న ఆలయ పైకప్పు మరమ్మతులకు సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: శతాబ్దాల నాటి అప్పన్న స్వామి దేవాలయం పైకప్పునకు మరమ్మతులు చేయించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పురాతనమైన ఈ ఆలయ నిర్మాణంలో కొన్నేళ్లుగా వర్షానికి నీరు కారుతోంది. ఆలయ బేడామండపం, ఆస్థాన మండపంలో వర్షం నీరు కారుతోంది. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు నిపుణుల సలహాలతో మరమ్మతులు చేయించాలని నిర్ణయించారు. ఇప్పటికే గతంలో ఓసారి పరిశీలించిన విషయం తెలిసిందే. తాజాగా పుణెకు చెందిన ఓ ఆధ్యాత్మిక సేవా ట్రస్టు ఆలయానికి మరమ్మతులు చేయడానికి ముందుకొచ్చింది. ఇప్పటికే ఈ సంస్థ శ్రీశైలం, శ్రీకాళహస్తి దేవాలయాలకు మరమ్మతులు చేస్తోంది. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల విన్నపం మేరకు సింహాచలంలో కూడా మరమ్మతులు చేపట్టేందుకు ముందుకొచ్చింది. ఆ మేరకు సంస్థకు చెందిన నిపుణులు జమీల్, వెంకటేశ్వరరావు ఆలయాన్ని సందర్శించి పైకప్పు పరిశీలించారు. గతంలో చేపట్టిన పనుల్లో నాణ్యత లేనట్లు గుర్తించారు. ఆ మేరకు పురాతన ఆలయాల మరమ్మతులకు అనుసరించే విధానంతో మరమ్మతులు నిర్వహించాలని భావించారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈ బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నిపుణులు, ఇంజినీరింగ్ అధికారులు

స్వధార్ గృహం నుంచి యువతి అదృశ్యం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలోని స్వధార్ గృహం నుంచి మంగళవారం ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటనకు సంబంధించి పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా.. నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసుకు సంబంధించి 24ఏళ్ల బాధిత యువతిని న్యాయస్థానం ఆదేశాల మేరకు పెందుర్తిలోని స్వధార్ గృహంలో సంరక్షణకు అప్పగించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఈ యువతి ఈ ఏడాది సెప్టెంబరు నుంచి గృహంలో సంరక్షణ పొందుతోంది. మంగళవారం ఉదయం నిర్వాహకుల కళ్లు గప్పి పారిపోయింది. సంబంధిత గృహం ఇన్‌ఛార్జి లింగమ్మ ఈ మేరకు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కొరవడిన నిఘా : స్వధార్ గృహంలో బాధిత మహిళలపై నిఘా కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజా ఘటన నేపథ్యంలో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించేందుకు ప్రయత్నించగా డేటా నిక్షిప్తం కాకపోవడంతో ఇతర ప్రాంతాల్లోని కెమెరాలను పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో కూడా ఈ గృహం నుంచి పలువురు అదృశ్యం కావడం అనుమానాలకు తావిస్తోంది. బాధిత మహిళలను పటిష్ఠ నిఘా, భద్రత మధ్య సంరక్షించాల్సి ఉండగా గృహం నిర్వహణ నామమాత్రంగా జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగటి పూట అందరూ ఉండగానే యువతి పారిపోవడమేమిటని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇక మీదట ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – జనక అయితే గనక
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి– విశ్వం, చేటుమహరాజ్
(వెల్లంకి) – వేట్టయన్ ది హంటర్

మత్స్యకార సొసైటీ నూతన కార్యవర్గం : భీమునిపట్నం: భీమిలి బోయివీధి మత్స్యకార సొసైటీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. రానున్న అయిదేళ్ల కాలానికి మంగళవారం మత్స్యశాఖ అధికారులు మురళీ, వంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో వాడమదుల సత్యారావు అధ్యక్షునిగా, సొసైటీ ఉపాధ్యక్షునిగా తెడ్డు రామదాసు, డైరెక్టర్లుగా తెడ్డు సింహాద్రి, కొక్కిరి నూకరాజు, కాసరపు తాతారావు, కదిరి ఎల్లయ్య, కాసరపు ఎల్లాజీ ఎన్నికయ్యారు. బోయివీధిలో 2001లో ఏర్పాటైన ఈ సొసైటీలో ప్రస్తుతం 251 మంది సభ్యులు ఉన్నారు. సొసైటీ అధ్యక్షుడు సత్యారావు మాట్లాడుతూ మత్స్యశాఖ నుంచి సొసైటీ సభ్యులకు రావాల్సిన నిధులు, సంక్షేమ పథకాల కోసం కృషి చేస్తానన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ|| 10 నుంచి మ|| ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: రుషికొండ ఎంఆర్ లక్షురియా ప్రాంతంలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. –స్థానికులు, రుషికొండ

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: జూ పార్కు సమీప బీచ్‌లో మందుబాబుల బెడద అధికంగా ఉంది.–రవిచంద్ర, పర్యాటకుడు

సమాధానం: మందుబాబులపై కేసులు నమోదు చేస్తాం. –ఆరిలోవ పోలీసులు

సమస్య: ఎండాడ-రుషికొండ మార్గంలోని సందీప్ నగర్ మలుపులో పైప్‌లైన్ మరమ్మతుల కోసం గోతులు తవ్వి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. –స్థానికులు, ఎండాడ

సమాధానం: గోతులు పూడ్చి సమస్య పరిష్కరిస్తాం. –సురేష్, మంచినీటి విభాగం ఏఈ

నిత్య సాధన.. ఉత్తమ శిక్షణ

ఎన్‌సీసీ క్యాడెట్లకు వివిధ అంశాల్లో తర్ఫీదు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ క్యాడెట్లు మరింత నైపుణ్యం పెంపొందించుకుని ప్రగతి సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడి దేశాభివృద్ధికి దోహదపడే లక్ష్యంగా రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల వేదికగా ఇటీవల పది రోజుల పాటు ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ(నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్) విభాగాల క్యాడెట్ల శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు.

★ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ వి.ఎం.రెడ్డి, 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్, జీవీపీ ఎన్‌సీసీ విభాగాధికారి కెప్టెన్ ఆర్.బి.అనంతరావు పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు విద్యాలయాలకు చెందిన సుమారు 370 మంది ఎన్‌సీసీ విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని ధ్రువపత్రాలు అందుకున్నారు.



రైఫిల్ వినియోగంపై శిక్షణ ఇస్తున్నారిలా..

ఏయే అంశాల్లో..

★ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, సమాజం పట్ల బాధ్యత, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు అలవడి వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడేందుకు దోహదపడేలా పలు అంశాల్లో తర్ఫీదు ఇచ్చారు.

★ ఆధ్యాత్మికభావం పెంపొందించే దిశగా నగర పరిధిలోని శ్రీవారి ఆలయం, ఇస్కాన్ మందిరం, సింహాచలం తదితర పుణ్యక్షేత్రాల్ని సందర్శించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉన్నతాధికారి

★ 24 మంది ఆర్మీ ఉద్యోగుల సమక్షంలో ఫైరింగ్ సంబంధిత అంశాల్లో సాధన చేశారు.

★ స్వచ్ఛభారత్‌లో భాగంగా రుషికొండ, సాగర్‌నగర్ తదితర సందర్శనీయ తీరాల్లో శుభ్రత కార్యకలాపాలు చేపట్టారు.

★ పర్యావరణ పరిరక్షణ దిశగా ప్లాస్టిక్ వినియోగం వల్ల తలెత్తే అనర్థాలు, సముద్ర తీరప్రాంతాల్ని శుభ్రంగా ఉంచడం వల్ల చేకూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

★ మానవ కార్యకలాపాల కారణంగా దెబ్బతింటున్న ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వివరించారు.

★ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ వల్ల భావితరాలకు చేకూరే ఉపయోగకర అంశాల్ని చాటిచెప్పారు.

★ రహదారి భద్రతకు సంబంధించి వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం తదితర జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 'హెల్మెట్ ధరించండి.. ప్రాణాల్ని రక్షించుకోండి' అనే నినాదంతో ట్రాఫిక్ నిబంధనలు పాటించి చట్టాల్ని అంతా గౌరవించాలని పేర్కొన్నారు.

★ రక్తదాన శిబిరాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ... అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందించడం ద్వారా ప్రాణాలు నిలుస్తాయని.... ఈ క్రమంలో ప్రస్తుత అవసరాల్ని గుర్తించి యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

★ సంపూర్ణ ఆరోగ్యం దిశగా యోగా చేయడం వల్ల చేకూరే ఉపయోగకర అంశాల్ని తెలియజేశారు.

మత్స్యకారులకు దివీస్ చేయూత

చిప్పాడ(తగరపువలస), న్యూస్‌టుడే: చిప్పాడ దివీస్ లేబొరేటరీస్ యాజమాన్యం పెద నాగమయ్యపాలెం పంచాయతీలోని పలువురు మత్స్యకారులకు చేయూతనిచ్చింది. మత్స్యశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు జి.విజయ చేతులమీదుగా మంగళవారం 20 మందికి రూ.17,80,000 విలువ గల ఇంజన్లు అందజేసింది. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, నాయకులు డీఏఎన్ రాజు, గాడు వెంకటప్పుడు, సరగడ అప్పారావు, దివీస్ అధికారులు కోటేశ్వరరావు, సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బోటు ఇంజన్లు అందిస్తున్న జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు విజయ

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



రాసపోలమాంబ

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాసపోలమాంబను బంతిపూలతో మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.

వేగ నియంత్రిక ఏర్పాటు

స్పందనకు వందనం

పీఎంపాలెం , న్యూస్‌టుడే: పీఎంపాలెం క్రికెట్ స్టేడియం కూడలి సమీప సేవామార్గంలో ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు వేగ నియంత్రిక ఏర్పాటు చేశారు. ఇక్కడ రోడ్డు మధ్యలో గతంలో ఏర్పాటు చేసిన పరికరాలు శిథిలమవ్వడంతో ఇటీవల 'వేగ నియంత్రికలు ఇలా ఉంటే ఎలా' శీర్షికన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి పోలీసులు స్పందించారు. శిథిల నియంత్రిక తొలగించి కొత్తది ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

● గంజాయితో పోలీసులకు చిక్కిన రౌడీషీటర్

ఆనందపురం, న్యూస్‌టుడే: భీమిలి అడ్డురోడ్డు వద్ద గంజాయితో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని ఆనందపురం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ సీహెచ్.వాసునాయుడు తెలిపిన వివరాలిలా.. ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి చెందిన పైల ప్రసాద్(43) విశాఖ నగరానికి ఓ ప్రైవేటు వాహనంలో ప్రయాణికులతో కలిసి 4 కిలోల గంజాయిని బ్యాగులో తరలిస్తున్నాడు. వాహనాల తనిఖీల్లో భాగంగా పరిశీలించగా అతడి వద్ద గంజాయి ఉండడంతో అదుపులోకి తీసుకుని భీమిలి కోర్టులో ప్రవేశపెట్టినట్లు సీఐ పేర్కొన్నారు. ఇతడు ఆనందపురం పోలీసుస్టేషన్ పరిధిలో రౌడీషీటర్ అని ఆయన వెల్లడించారు.

● డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలోని ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలు, వ్యర్థాలు తొలగించారు. వారంలో ఒక రోజు స్వచ్ఛభారత్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

● పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

తగరపువలస, న్యూస్‌టుడే: సాయి సంహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తగరపువలసలోని పలువురు పేదలకు మంగళవారం ఆహార పొట్లాలు, బిస్కెట్లు, మిఠాయిలు ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకురాలు మద్దిరెడ్డి సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జిమ్‌సర్ ప్రొ-వీసీ డాక్టర్ బి.గీతాంజలి తదితరులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రొమ్ము క్యాన్సర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా గీతం డీమ్డ్ వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి(జిమ్‌సర్)లో మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని జిమ్‌సర్ ప్రొ-వీసీ డాక్టర్ బి.గీతాంజలి ప్రారంభించారు. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన పెరగాలని ముఖ్యంగా చిన్నపాటి పరీక్షలతో దీనిని గుర్తించి చికిత్స తీసుకోవచ్చన్నారు. డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వసంత్‌కుమార్, అంకాలజిస్ట్ డాక్టర్ కార్తిక్ చంద్ర కూడా మాట్లాడారు. ఈ చికిత్సా విధానంలో వస్తున్న నూతన పరిజ్ఞానాన్ని వివరించారు. సంబంధిత అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బోధన, బోధనేతర, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'..

గ్రామీణభీమిలి, ఆనందపురం, న్యూస్‌టుడే: భీమిలి మండలంలోని అన్నవరం, అమనాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ గ్రామాల్లో ప్రధాన పంటగా ఉన్న కొబ్బరిపై ప్రభుత్వం అందిస్తున్న రాయతీలను రైతులకు వివరించారు. ఎంపీపీ వాసురాజు, వ్యవసాయశాఖ అధికారిణి శివకోమలి, ఉద్యాన శాఖాధికారిణి స్వాతి, మండల పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతికిరణ్, తదితరులు పాల్గొన్నారు. ★ పెద్దిపాలెం, గంభీరం గ్రామాల్లోనూ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో సంధ్యరత్నప్రభ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి

మధురవాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులు వాటి ఏర్పాటులో నిబంధనలు పాటించాలని పెందుర్తి ఆబ్కారీ విభాగం సీఐ సరోజాదేవి అన్నారు. మధురవాడ, మిథిలాపురి వుడాకాలనీ, కొమ్మాది, పీఎంపాలెం, ఎండాడ, సుభాష్‌నగర్, ఐటీహిల్స్, రుషికొండ ప్రాంతాల్లో కొత్తగా ప్రారంభిస్తున్న మద్యం దుకాణాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ప్రార్థనా స్థలాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులకు దగ్గరగా లేకుండా చూసుకోవాలని యజమానులకు సూచించారు. సంబంధిత శాఖ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.



సుభాష్‌నగర్‌లోని మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ సరోజాదేవి

నేటి నుంచి రీసర్వే గ్రామసభలు

తగరపువలస, న్యూస్‌టుడే: భీమిలి మండలంలో బుధవారం నుంచి రీసర్వే గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు రామారావు తెలిపారు. ఇందులోభాగంగా ఈనెల 23న నిడిగట్టు, 26న రామయోగి అగ్రహారం, 29న బోడమెట్టపాలెం, 30న చిప్పాడ, వచ్చే నెల 1న టి.నగరపాలెం, 2న సింగనబంద, 5న అన్నవరం, 6న మూలకుద్దు, 7న అమనాం, 8న మజ్జివలస గ్రామాల్లో ఈ సభలు జరగనున్నాయన్నారు. ఆయా గ్రామాల రైతులు సభలకు హాజరు కావాలన్నారు.

ఆనందపురం, పద్మనాభం: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 23వ తేదీ నుంచి వచ్చే నెల 27వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆనందపురం మండలం కణమాం సచివాలయం వద్ద, పద్మనాభం మండలం అయినాడ గ్రామ సచివాలయం వద్ద ఈ సభలు జరుగుతాయన్నారు. రీసర్వేలో సమస్యలున్న రైతులు వినతులిచ్చి సమస్యలు చెప్పుకోవచ్చునన్నారు.

మందుబాబులకు జరిమానా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి ఆబ్కారీశాఖ ప్రత్యేక జ్యుడీషియల్ జడ్జి జరిమానా విధించినట్లు ఎస్సై జి.ప్రసాద్ తెలిపారు. వీరిలో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.60 లక్షల అపరాధ రుసుం చెల్లించాలని ఆదేశించారన్నారు.

ధరల పెంపుతో సామాన్యులపై పెనుభారం: సీపీఐ

మధురవాడ, న్యూస్‌టుడే: అడ్డూ అదుపు లేకుండా నిత్యావసరాల ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెం, అయోధ్యనగర్, కొత్తపాలెం ప్రాంతాల్లో ధరల పెరుగుదలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన ధరలు అదుపులో పెట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం.డి.బేగం, వి.సత్యనారాయణ, కొల్లి భాస్కరరావు, కానూరి రామారావు, పి.రమణ, కె.చిన్న, ఎన్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల నుంచి గోదాముకు!!

◆ ప్రభుత్వ మద్యం దుకాణాల సామగ్రి అందజేత
◆ రశీదులివ్వకపోవడంతో సిబ్బంది తర్జన భర్జన

ఆనందపురం, న్యూస్‌టుడే

మద్యం క్రయ విక్రయాలను స్వయంగా ప్రభుత్వమే నిర్వహించేలా గత వైకాపా సర్కారు అమలు చేసిన విధానం సరికాదని కూటమి ప్రభుత్వం భావించి వీటి నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇప్పటి వరకు విక్రయించగా మిగిలిన మద్యం, వినియోగించిన వాహనాలు, దుకాణాల అద్దెలు, సిబ్బంది జీతభత్యాలు వంటి అంశాలపై ఆబ్కారీ శాఖ అధికారులకే ఇంకా ఓ స్పష్టత లేకపోవడంతో ఇప్పటి వరకు ఆయా దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది తర్జన భర్జన పడుతున్నారు.

★ ఈనెల 14వ తేదీన మద్యం దుకాణాలకు లాటరీల ద్వారా వ్యాపారులను ఎంపిక చేసి 16వ తేదీ నుంచి అమ్మకాలకు అనుమతులిచ్చారు. విశాఖ జిల్లాలో ఆనందపురం ఆబ్కారీశాఖ గోదాముల పరిధిలో 70 దుకాణాలు ఉండగా ఈనెల 15వ తేదీ రాత్రి 9 గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయాలు జరిగాయి. ★ 16వ తేదీ నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడడంతో వాటిలో మిగిలిన మద్యం నిల్వలు, ఫర్నిచర్, కంప్యూటర్ ఇతర సామగ్రిని అధికారులు వెనక్కి రప్పించి గోదాముకు తరలించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఆయా దుకాణాల్లో పనిచేసిన సిబ్బందికి తిరుగు రశీదులు ఇవ్వకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ★ వారికి గత నెల వేతనంతో పాటు ఈ నెల జీతభత్యాలు ఇవ్వలేదు. వీరి నియామకం సమయంలో దుకాణాల్లో ఉన్న వస్తువులకు సంబంధించి ఆబ్కారీ శాఖ రూ.100 విలువ గల బాండ్లపై అంగీకారపత్రాలు తీసుకుంది. ఇప్పుడు దుకాణాల నుంచి వాటిని వెనక్కి తీసుకున్న సమయంలో ఎలాంటి రశీదులు ఇవ్వకపోవడంతో వారు తర్జన భర్జన పడుతున్నారు.



వెనక్కి తెచ్చిన ఎలక్ట్రానిక్ పరికరాలు, మద్యం, ఫర్నిచర్

ఆనందపురం గోదాముకు ఏమేమి తీసుకొచ్చారంటే..

★ మద్యం	:	6192 కేసులు(పెట్టెలు)
★ కంప్యూటర్లు	:	70
★ ట్యాబ్‌లు	:	70
★ సీసీ కెమెరాలు	:	140
★ ఫ్రిజ్‌లు	:	70
★ సీలింగ్ ఫ్యాన్లు	:	70

★ గోదాము పరిధిలో ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలుకు గతంలో సుమారు రూ.2కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

★ 15వ తేదీ తర్వాత వెనక్కి తెచ్చిన మద్యం ఖరీదు సుమారు రూ.8 కోట్లు ఉంటుందని అంచనా.

ఈ విషయమై ఆబ్కారీ శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా.. ఆనందపురం గోదాముల పరిధిలోని 70 దుకాణాల నుంచి మద్యం నిల్వలు, ఫర్నిచర్ ఇతర సామగ్రి వెనక్కి తెచ్చాం. వీటికి సంబంధించి అక్కడి సిబ్బంది సమక్షంలోనే లెక్కించాం. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని అన్నారు.

'జల సంరక్షణ'కు జాతీయ పురస్కారం



కేంద్రమంత్రి పాటిల్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న తిరుమల నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఉక్కునగరం (కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: నీటి సంరక్షణ చర్యలు పాటిస్తున్నందుకు కూర్మన్నపాలెం సమీప శ్రీ తిరుమలనగర్ సంక్షేమ సంఘానికి దేశ వ్యాప్త గుర్తింపు దక్కింది. మంగళవారం దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో 5వ వాటర్ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ చేతుల మీదుగా తిరుమలనగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి పరమానందం కలిసి తృతీయ పురస్కారాన్ని అందుకున్నారు. సంఘం ఆధ్వర్యంలో కాలనీలో 100 రూఫ్ టాప్ ఇంకుడు గుంతల ద్వారా 16 లక్షల క్యూబిక్ లీటర్ల నీటిని పొదుపు చేశారు. అలాగే పార్కులు, రహదారుల పక్కన మరో 62 ఇంకుడు గుంతలు తవ్వి 30.97 లక్షల క్యూబిక్ లీటర్ల నీటిని సంరక్షించడంతో పురస్కారానికి ఎంపిక చేశారు.

సమష్టి కృషితో జిల్లాకు జల్‌శక్తి అవార్డు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జలవనరుల నిర్వహణ, సంరక్షణలో 2023 ఏడాదికి గాను ఉత్తమ జిల్లా కేటగిరీలో విశాఖకు కేంద్ర జల్‌శక్తి అవార్డు లభించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం న్యూదిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలవనరులు, జీవీఎంసీ, గ్రామీణ నీటి సరఫరా, ఉద్యాన, అటవీ, పర్యావరణం, ఆరోగ్యం, విద్య, గ్రామీణ విభాగాలు సమష్టిగా పనిచేయడం వల్ల జిల్లాలో జలవనరుల సంరక్షణకు చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కిందన్నారు. విశాఖ నగరంలో 24గంటలపాటు నీటి సరఫరాను 40 చదరపు కిలోమీటర్ల పరిధిలో అమలు చేశారన్నారు. ఫలితంగా జాతీయ స్థాయిలో జల్‌శక్తి అవార్డు జిల్లా కైవసం చేసుకుందని తెలిపారు.

పార్కులు, మైదానాలకు మహర్దశ

గాజువాకలో ఎంపీ, ఎమ్మెల్యే, వీఎంఆర్‌డీఏ కమిషనర్ పర్యటన

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలిచిన గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లోని పబ్లిక్ పార్కులు, క్రీడా మైదానాలకు మంచి రోజులు రానున్నాయి. మంగళవారం విశాఖ ఎంపీ శ్రీభరత్, తెదేపా అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఇతర అధికారులు గాజువాకలో పర్యటించారు. చినగంట్యాడ అమరావతి పార్కు, పూడిమడక ఓపెన్ ఆడిటోరియాన్ని పరిశీలించి ఆధునికీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. పెదగంట్యాడ క్రీడా స్టేడియాన్ని క్రీడలకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. కణితిరోడ్డు నుంచి గోపాలరెడ్డినగర్ వరకు ఉన్న ఫుడ్‌కోర్ట్ సెంటర్ మీడియం డివైడర్ పార్కులను తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. అనంతరం దయాల్‌నగర్ కొండపై ఉన్న స్థలాన్ని పరిశీలించి.. సౌకర్యాల కల్పనపై చర్చించారు. వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, జెడ్పీ శ్యామ్, పర్యవేక్షక ఇంజినీరింగ్ బలరామరాజు, కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, బాలునాయుడు, మహ్మద్ రఫీ, రమణారెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



దయాల్‌నగర్ కొండను పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

మందులు పరీక్షలు ఇక్కడే..

విమ్స్‌లో త్వరలో ప్రారంభం కానున్న డ్రగ్ స్టోర్, డయాగ్నస్టిక్ సెంటర్

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే

విశాఖ వైద్య విజ్ఞాన కేంద్రం(విమ్స్ ఆసుపత్రి) మరో రెండు విభాగాలు సమకూర్చుకొని ఉత్తరాంధ్ర ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించడానికి సిద్ధమవుతోంది. రూ. 20 కోట్ల వ్యయంతో ఏపీఎస్ఐఎండీసీ ఆధ్వర్యంలో సిటీ డయాగ్నస్టిక్ సెంటర్, రీజనల్ డ్రగ్ స్టోర్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనివల్ల పేద ప్రజలకు పలు ప్రయోజనాలు సమకూరనున్నాయి.



సిటీ డయాగ్నస్టిక్ సెంటర్, రీజనల్ డ్రగ్ స్టోర్

సిటీ డయాగ్నస్టిక్ సెంటర్..

విమ్స్‌లో ఏర్పాటు కానున్న సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో పాథాలజీ, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, ఎంఆర్ఐ, సిటీస్కాన్, ఈసీజీ, 2డీ ఎకో, రక్తపరీక్షలు, స్కానింగ్ ఉచితంగా నిర్వహిస్తారు. ఇవి కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తుండగా, విమ్స్‌లో నామమాత్రపు రుసుములు తీసుకుని చేస్తున్నారు. ఈ కేంద్రం వస్తే పూర్తి ఉచితంగా సేవలు అందనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రేడియాలజీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేంద్రం ఏర్పాటు అయితే కేజీహెచ్ మీద కూడా భారం తగ్గనుంది.

ప్రాంతీయ మందుల నిల్వ కేంద్రం..

ఉత్తరాంధ్ర జిల్లాలకు అవసరమయ్యే మందులు, వైద్య పరికరాలు అందించే ఉద్దేశంతో విమ్స్‌లో ప్రాంతీయ మందుల నిల్వ కేంద్రం త్వరలో ప్రారంభించనున్నారు. ఈ కేంద్రంలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రధాన ఆసుపత్రులకు రాష్ట్ర వైద్యవిద్య ఆధ్వర్యంలో మందులు, శస్త్రచికిత్స పరికరాలు నిల్వ చేయనున్నారు. ఇక్కడ మందులు, శస్త్రచికిత్సల పరికరాలు అందుబాటులో ఉంచటం వల్ల రాజధాని నుంచి వచ్చే కాలయాపన తగ్గనుంది.

కేజీహెచ్‌కు ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దాలనే

కేజీహెచ్‌లో రోగనిర్ధారణ పరీక్షలకు రద్దీ అధికంగా ఉంటుంది. అటువంటి వారికి వివిధ రకాల వైద్య పరీక్షల కోసం ఇక్కడ ఏర్పాటు చేయనున్న సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ బాగా ఉపయోగపడుతుంది. డ్రగ్ స్టోర్ వల్ల ఉత్తరాంధ్రలోని ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా ఇక్కడి నుంచే మందులు సరఫరా అవుతాయి. త్వరలో వీటిని ప్రారంభిస్తాం.– డాక్టర్ రాంబాబు డైరక్టర్ విమ్స్



కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పక్కాగా హిందీ అమలు



సదస్సులో పాల్గొన్న వివిధ శాఖల ఉన్నతాధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ భాషను పక్కాగా అమలు చేయనున్నట్లు ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. చేపలరేవు సమీపంలోని భారత మత్స్య పరిశోధన సంస్థ (ఎఫ్ఎస్ఐ) కార్యాలయంలో మంగళవారం నగర రాజభాష కార్యాన్‌వ్యాన్ సమితి విశాఖపట్నం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీ, సిఫ్‌నెట్, నిఫ్‌ఫాట్, ఎంఎండీ, డీఎల్ఎల్, ఎన్ఎస్‌టీఎల్, జీఎస్ఐ, కేంద్రీయ విద్యాలయం, ఆకాశవాణి, ఏయూ, ఇన్‌కంటాక్స్, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్, సైక్లోన్ వార్నింగ్ కేంద్రం, స్టీలుప్లాంటు తదితర కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖల్లో హిందీ భాష అమలు తీరుతెన్నులు, భాషాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. ఎఫ్ఎస్ఐ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును నేవల్ డాక్‌యార్డు జనరల్ మేనేజరు కమొడోర్ అజమతుల్లాఖాన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రత్యేక అతిధులుగా డాక్టర్ లలన్‌కుమార్, వీరేంద్రకాజీ (స్టీలుప్లాంట్) తదితరులు పాల్గొనగా అరుణ్ త్రివేది వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఐఎంఏ నగర శాఖ ఎన్నిక

గురుద్వారా, న్యూస్‌టుడే: ఐఎంఏ విశాఖపట్నం శాఖ ఎన్నికలు మంగళవారం సీతమ్మధార లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో జరిగాయి. అధ్యక్షులుగా డాక్టర్ వి.వాణి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.పి.జగదేశ్వరరావు, ఎం.సుబ్రహ్మణ్యం శర్మ, ఎం.వి.ఎస్.ఎస్ భాపరావు, కార్యదర్శిగా డాక్టర్ ఎం.వి.వి. మురళీమోహన్ తదితరులు ఎన్నికయ్యారు.

తనయుడి అంత్యక్రియలకు హాజరై తనువు చాలించిన తల్లి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కుమారుడు మృతి చెందడంతో కడసారి చూసేందుకు వచ్చిన తల్లి తనువు చాలించిన విషాద ఘటన తెలంగాణలోని కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన పసుపులేటి నరేందర్ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. తల్లి సులోచన(80) మరో కుమారుడు కృష్ణ కుటుంబంతో కలిసి ఏపీలోని వైజాగ్‌లో ఉంటున్నారు. మంగళవారం ఇల్లెందుకు వచ్చిన ఆమె అచేతన స్థితిలో ఉన్న కుమారుడిని చూసి తట్టుకోలేకపోయింది. నరేందర్ అంత్యక్రియలు ప్రారంభమవుతుండగా ఏడుస్తూ కుప్పకూలారు. కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసి ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన కొంతసేపటికే మృతి చెందింది. కుమారుడి అంత్యక్రియలు జరగ్గా బుధవారం సులోచన అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు, బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా సీతారామటాకీసు వెనుక ఖాసీ ఆశీష్‌అసిర్ ఖానాలో మొహరంను వీరి కుటుంబ సభ్యులు మూడు తరాలుగా నిర్వహిస్తున్నారు. ఆ వేడుకకు నాలుగు నెలల క్రితం కుటుంబ సభ్యులంతా కలిశారు.

25న వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష: గంటా



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చిత్రంలో పలువురు నాయకులు, అధికారులు

కొమ్మాది, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఈనెల 25వ తేదీన భీమిలిలో 40శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 6వవార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.66.45లక్షలతో అంతర్గత రహదారులు, కాలువలు, ప్రహరీ, వంతెనల నిర్మాణానికి కొమ్మాది కల్యాణమండపం వద్ద మంగళవారం ఎమ్మెల్యే గంటా శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 6వవార్డులోని కల్యాణమండపాన్ని గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేయగా.. వైకాపా పాలనలో అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. దీనిని రూ.80లక్షలతో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. మధురవాడలో పారిశుద్ధ్యం, ఆక్రమణల సమస్యలు ఎక్కువగా ఉన్నందున అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇకపై తాను కూడా ఉదయం వేళల్లో ఆకస్మికంగా పర్యటిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త కోరాడ రాజబాబు, జెడ్పీ పి. సింహాచలం, తెదేపా, జనసేన వార్డు అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, సంతోష్‌నాయుడు, గొలగాని సన్యాసిరావు, గరే గురునాధ్, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, లొడగల జానకీరామ్, గొల్లంగి ఆనందబాబు, మొల్లి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వినూత్న నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తిస్తున్న అన్ని రకాల ఉత్తర్వులు వర్తింపచేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం డీఈఓ కార్యాలయం ముందు మోకాళ్ల మీద కూర్చొని నిరసన తెలిపారు. ప్రమోషన్లు, బదిలీలు రెగ్యులర్‌గా నిర్వహించాలని, మున్సిపల్ టీచర్లకూ అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. అనంతరం డీఈఓ చంద్రకళకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. నిరసనలో చుక్క సత్యం, కె.రాంబాబు, మహ్మద్, టి.జగన్, సంతోషి, జి.అప్పలరాము, ఎం.మురళీ, ఉషారాణి, శాంతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



వధూవరుల అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని వేడుకగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

'లవ్ భీమిలి'పై విన్యాసాలెందుకు!



ఓ అక్షరం దెబ్బతినడంతో ప్రస్తుతమిలా..

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి విచ్చేసే సందర్శకులను ఆకర్షించేందుకు బీచ్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన 'లవ్ భీమిలి' చిహ్నం చిన్నారుల విన్యాసాలతో క్రమేపీ పాడవుతోంది. భీమిలి విహార కేంద్రం కావడంతో నిత్యం వచ్చీపోయే పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఆరేళ్ల క్రితం దీన్ని ఏర్పాటు చేశారు. ఆంగ్ల అక్షరమాలికతో రెండు వైపులా డాల్ఫిన్ల బొమ్మలతో దీనిని ఏర్పాటు చేశారు. తిలకించి ఆనందించాల్సిన సందర్శకులు తమ పిల్లలను దీనిపై కూర్చోబెట్టి ఫొటోలు తీస్తున్నారు. గతంలో డాల్ఫిన్ బొమ్మలు విరిగిపోగా వాటిని మళ్లీ అతికించారు. ప్రస్తుతం ఇందులోని ఇ అక్షరం వంగిపోయింది. ఈ నేపథ్యంలో గతంలో బుద్ధుని విగ్రహం చుట్టూ ఇనుప ఊచలు ఏర్పాటు చేసిన తరహాలోనే దీనికి కూడా రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు విద్యుత్ స్తంభం ఏర్పాటు

స్పందనకు వందనం

ఎండాడ, న్యూస్‌టుడే: గీతం కళాశాల రోడ్డు మధ్యలో ఎండాడ కొండపైకి వెళ్లే కూడలిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. కొందరు వాహన చోదకులు దీన్ని ఢీకొనడంతో మరమ్మతులకు గురైంది. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి సంబంధిత ఏఈ చక్రవర్తి స్పందించారు. వెంటనే ఆ స్తంభాన్ని తొలగించి, కొత్తది ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుమురం భీం జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ (టీసీఆర్ అండ్ టీఎమ్), గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు కుమురం భీం జయంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ధైర్య సాహసాలు, గొప్పతనాన్ని వక్తలు అభివర్ణించారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో దర్బార్

కొమ్మాది, న్యూస్‌టుడే: బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో మంగళవారం దర్బార్ నిర్వహించారు. కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. విధి నిర్వహణలో ఎలా ఉండాలో వివరించారు. అనంతరం ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి.మోహన్‌రావును సత్కరించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. అదనపు కమాండెంట్ సీహెచ్.వి.ఎస్.పద్మనాభరాజు, సహాయ కమాండెంట్ పి.సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఐ మోహన్‌రావును సత్కరిస్తున్న కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ తదితరులు

అనంతపద్మనాభుని పవిత్రోత్సవాలకు ఆహ్వానం

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో కొలువుదీరిన శ్రీ అనంతపద్మనాభుని పవిత్రోత్సవాలు ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు పద్మనాభం మండలం కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా, భాజపా, జనసేన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శిల్పారామంలో శాఖాపరంగా విచారణ..

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామంలో పనిచేస్తున్న ఓ మహిళను పరిపాలనాధికారి, మరో ఉద్యోగిని వేధింపులకు గురిచేస్తున్నారని ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం శాఖాపరంగా విచారణ చేపట్టారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి ఆదేశాల మేరకు పులివెందుల శిల్పారామం ఏవో బి.సుధాకర్, కాకినాడ డీఈవో సరళ బాధితురాలితోపాటు ఇక్కడి పని చేస్తున్న సిబ్బందిని ఒక్కొక్కరితో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారికి అందజేస్తామన్నారు.

రహదారిపై వ్యర్థాల బెడద

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి రాజీవ్‌నగర్(ఎండాడ) నుంచి బీచ్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో ఓ కళాశాలకు చెందిన మరుగుదొడ్ల వ్యర్థాలు రోడ్డుపైకి వస్తుండడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

గృహనిర్మాణ కాలనీల్లో విజిలెన్స్ తనిఖీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : గృహనిర్మాణ సంస్థ ద్వారా విశాఖ జిల్లాలో పలు ప్రాంతాల్లో చేపడుతున్న కాలనీ నిర్మాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరుగుతున్నాయా? లేదా అనేది పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాల నాణ్యతను చూశారు. బిల్లులు ఆమోదం పొందిన వాటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని గృహనిర్మాణ సంస్థకు చెందిన అధికారుల నుంచి తీసుకున్నారు. మిగిలిన లేఅవుట్లలో వరుసగా తనిఖీలు చేపట్టనున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్‌డ్	206	240
స్కిన్‌లెస్	234	250

మత్స్యకారుల జీవన స్థితిగతులపై పుస్తకావిష్కరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : మత్స్యకారుల జీవన స్థితిగతులపై మత్స్యకార యువకుడు పిళ్లి కోదండరావు రచించిన 'మత్స్యకారుల పుట్టుక, వికాసం, అభివృద్ధి' పుస్తకావిష్కరణ ఆంధ్రవిశ్వవిద్యాలయం టి.ఎల్.ఎన్.సభాహాలులో జరిగింది. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ అధ్యక్షులు మోస అప్పలరాజు, ఆవాల రమేష్, మత్స్యకార నాయకులు, తెలుగు శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ తూర్పు

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టార్‌-6 వెంకటేశ్వరస్వామి ఆలయం రహదారి రోడ్డులో తాగునీరు వృథాగా పోతుంది – ఎం.హనుమంతరావు

సమాధానం : పైపులైను పరిశీలించి మరమ్మతులు చేపడతాం – శంకర్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

దోమల నివారణకు కృషిచేయాలి


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : దోమల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని గాంబియా దేశానికి చెందిన సోషల్ వర్క్ విద్యార్థిని ఆడమ్ బి.సార్ అన్నారు. మంగళవారం గ్రీన్‌క్లైమెట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం నేతృత్వంలో ఇసుకతోట ప్రాంతంలో ఉన్న ఓ ప్రయివేట్ పాఠశాలలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లలో నీటిని నిల్వలేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు ఎంఎ సోషల్ వర్క్ విద్యార్థులు పాల్గొన్నారు.

డీడీలు చెల్లించిన వారికి శుభవార్త!

పక్కాగృహాలు రాని లబ్ధిదారులకు డీడీ మొత్తం చెల్లింపు

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

అందరికి ఇళ్లు పథకంలో భాగంగా గత తెదేపా ప్రభుత్వ హయాంలో చెల్లించిన డీడీల మొత్తాన్ని లబ్ధిదారులకు తిరిగి వెనక్కి ఇచ్చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాటి ప్రతిపక్షాలు ఒత్తిడి తీసుకురాగా, ఎన్నికలకు ముందు జీవీఎంసీ అధికారులు కొంతమందికి చెక్కుల రూపంలో లబ్దిదారుని వాటాను తిరిగి చెల్లించారు. ఎన్నికల కోడ్ రావటంతో నిలిచిపోయిన చెక్కుల పంపిణీ తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రారంభించారు. జోన్ల వారీగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేపడుతున్నారు.

గత తెదేపా ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద టిడ్కో ఇళ్లకు తూర్పు నియోజకవర్గానికి 23వేల వరకు అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ఎన్నికలకు ముందు టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారుని వాటా చెల్లించిన వారికే ఇళ్లు వస్తాయని ప్రచారం జరగటంతో లబ్ధిదారులు తమ వాటా కింద రూ.500, రూ.12,500, రూ.25 వేలు చొప్పున జీవీఎంసీ కమిషనర్ పేరిట డీడీలు తీసి చెల్లించారు. సుమారు 8600 మంది వరకు డీడీలు చెల్లించగా, వాటిని యూసీడీ సిబ్బంది తీసుకుని, రసీదులు కూడా అందజేశారు.


ఆన్‌లైన్‌లో లబ్ధిదారుని వివరాలు పొందుపరుస్తున్న సిబ్బంది

✦ గత వైకాపా ప్రభుత్వంలో 300 ఎస్ఎఫ్‌టీ ఇళ్లను రూ.1కి రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని, ఇళ్ల స్థలాలను ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలో 3210 మంది లబ్ధిదారులు మాత్రమే టిడ్కో ఇళ్లను ఎంచుకుంటే, సుమారు 21వేల మందికి ఇంటి స్థలాల పట్టాలు అందజేశారు. ఇక అనర్హులు, 300 ఎస్ఎఫ్‌టీ, ఇళ్ల స్థలాలు పొందిన వారికి ఇళ్ల కోసం చెల్లించిన డీడీలను చెల్లించాల్సి ఉండగా ఎన్నికల ముందు వరకు పట్టించుకోలేదు. డీడీల కోసం లబ్ధిదారుల నుంచి ఒత్తిడి రావటంతో పాటు నాటి కౌన్సిల్ సమావేశాల్లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పట్టుపట్టడంతో డీడీల మొత్తాన్ని వెనక్కి ఇవ్వటానికి జాబితాను సిద్ధం చేసి, ఎన్నికల సంవత్సరంలో పంపిణీ చేపట్టారు. ఈలోగా ఎన్నికలు రావటంతో చెక్కుల పంపిణీ నిలిచిపోయింది.

✦ బ్యాంకుల్లో ఇందుకు సంబంధించిన మొత్తం సిద్ధంగా ఉండటంతో కూటమి ప్రజాప్రతినిధులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లటంతో ఆయా మొత్తాలను వెనక్కి ఇవ్వటానికి పచ్చజెండా ఊపారు. దీంతో ఎన్నికల ముందు నిలిచిపోయిన ప్రక్రియను తిరిగి ప్రారంభించటంతో పాటు చెక్కులు సిద్ధం చేశారు.

✦ లబ్ధిదారులు చెల్లించిన డీడీ, రసీదుల నకళ్లు, ఆధార్‌కార్డు తదితర వాటిని జోనల్ కార్యాలయంలో సమర్పిస్తే, వాటిని ఆన్‌లైన్‌లో సరిపోల్చి లబ్ధిదారుడి ఫోటో తీసుకుని అప్‌లోడ్ చేసి వారికి ఇవ్వాల్సిన చెక్కును వెంటనే ఇచ్చేస్తున్నారు. అన్ని పత్రాలు సమర్పిస్తే, ఎలాంటి ఆలస్యం లేకుండా చెక్కును ఇస్తున్నారు. లబ్ధిదారులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబసభ్యులు మృతుని మరణ ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటోంది. లబ్ధిదారుడు మృతిచెందితే వారి కుటుంబసభ్యులకు మాత్రమే ఆయా మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేస్తున్నారు.

'ఒంటికి యోగా మంచిదే' పుస్తకావిష్కరణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : యోగా విశిష్టతను వివరించేలా రచించిన ఒంటికి యోగా మంచిదే పుస్తకాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారు. మంగళవారం తెదేపా కార్యాలయంలో విశాఖ జిల్లా యోగా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్యకర జీవనానికి యోగా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ యోగసాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ కె.ఉమామహేష్, యోగాచార్య సాంబశివరావు, జిల్లా యోగా సంస్థ కార్యదర్శి రమేష్, శ్రీను, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

■ **నేడు జరగాల్సిన ఈసీ వాయిదా**

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బుధవారం జరగాల్సిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం వాయిదా వేసినట్లు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉండడంతో వాయిదా వేయాలని ఉన్నత విద్యామండలి సూచించినందున వాయిదా వేశామన్నారు. ఎప్పుడు నిర్వహించేది తర్వాత తేదీ నిర్ణయించనున్నట్లు తెలిపారు.

■ **ఎం.ఎస్.ఎం.ఈ. ఛైర్మన్‌కు అభినందనలు**

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఎం.ఎస్.ఎం.ఈ. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తమ్మిరెడ్డి శివశంకర్‌ను జనసేన యువజన నాయకులు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీలు మర్యాదపూర్వకంగా కలిశారు. శివశంకర్‌కు శాలువా కప్పి సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆయనకు ప్రాముఖ్యత కలిగిన సంస్థకు ఛైర్మన్‌గా నియమించినందుకు కూటమి నాయకులు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

■ **మానవ హక్కుల సదస్సుకు ఆహ్వానం**

ఎం.వి.పి.కాలనీ, పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మానవహక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో నవంబరులో విశాఖ వేదికగా జరిగే సదస్సుకు రావాల్సిందిగా జాతీయ మానవహక్కుల కమిషన్ సెక్రటరీ జనరల్ భరత్ లాల్‌ను మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ దిల్లీలో కలిసి ఆహ్వానించారు. ఆయనకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సదస్సు జరిగే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

■ **పరిశుభ్రతపై అవగాహన**

ఆరిలోవ, న్యూస్‌టుడే: చినగదిలి సంతపాలెం ప్రాథమిక పాఠశాల, తోటగరువు ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ పరిసరాలు.. పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలకు పెద్ద ప్లాస్టిక్ బకెట్లు, పిల్లలు వ్యాయామం చేసుకునేందుకు స్కిప్పింగ్ రోప్స్ అందజేశారు. కార్యక్రమంలో శాలివాహన్, రాంపాల్ ద్వివేది, విజయ్‌కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ **అన్నదాన కార్యక్రమం**

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ టి.ఐ.సి. పాయింట్ దగ్గర మంగళవారం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. దుర్గా నవరాత్రుల సందర్భంగా కాలనీ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రామకృష్ణబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ.కిషోర్, కె.వెంకట్, రియాజ్, తెదేపా నాయకులు గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, ముగడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

■ **ఆదాయపన్ను నిధులు వెనక్కివ్వాలని వినతి**

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి మినహాయించిన ఆదాయ పన్ను నిధులను వెనక్కి ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ వద్ద ఆందోళన నిర్వహించి కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులు ఆదాయపన్ను పరిధిలోకి రాకపోయినా జీతాల నుంచి మినహాయించారన్నారు. వెనక్కి వచ్చిన నిధులను కార్మికుల ఖాతాలలో జమ చేయాల్సి ఉండగా, మహిళా సంఘాల ఖాతాల్లో జమచేశారన్నారు. తక్షణమే నిధులు వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.

గృహనిర్మాణ కాలనీల్లో విజిలెన్స్ తనిఖీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : గృహనిర్మాణ సంస్థ ద్వారా విశాఖ జిల్లాలో పలు ప్రాంతాల్లో చేపడుతున్న కాలనీ నిర్మాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరుగుతున్నాయా? లేదా అనేది పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాల నాణ్యతను చూశారు. బిల్లులు ఆమోదం పొందిన వాటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని గృహనిర్మాణ సంస్థకు చెందిన అధికారుల నుంచి తీసుకున్నారు. మిగిలిన లేఅవుట్లలో వరుసగా తనిఖీలు చేపట్టనున్నట్లు సమాచారం.


తంగుడుబిల్లి లేఅవుట్ పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మహిళా పోలీసు స్టేషన్ ఎస్.ఐ. యు.రూపవతి అన్నారు. సమతా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని పోక్సో చట్టం గురించి వివరించారు. మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దన్నారు. ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల డీన్ ఆచార్య ఎస్.విజయారవీంద్ర, డైరెక్టర్ శ్రీనివాస్, ఎన్.ఎస్.ఎస్. పి.ఒ.లు రాజేష్‌కుమార్, రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్.ఐ. రూపవతిని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

'నిబంధనలకు విరుద్ధంగా ముందుకువెళ్లవద్దు'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మాజీ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అధికారంలో ఉండగా జరిగిన నియామకాలపై ముందుకు వెళ్లవద్దని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అలుమ్ని అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి ఆరేటి ఉమామేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ యు.వి.రమణ ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావును కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు. తమ అసోసియేషన్ అధ్యక్షులు ఆచార్య కె.జాన్, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్, ఆరేటి ఉమామహేశ్వరరావు రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్, ముఖ్యమంత్రి, విద్యా శాఖమంత్రి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికు దీనిపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : భారత్ 2027 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ నాగేశ్వర్ చలసాని అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ డిపార్టుమెంట్‌లో మంగళవారం 'ఫైనాన్షియల్ లిటరసీ, మ్యూచువల్ ఫండ్స్, కార్పొరేట్ అవకాశాలు' అన్న అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. 65శాతం యువత గల దేశంలో 85 శాతం మంది అక్షరాస్యులు కాగా కేవలం 25 శాతం మంది మాత్రమే ఆర్థిక అక్షరాస్యులుగా ఉన్నారన్నారు. ఆచార్య జాలాది రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య బి.మోహన్‌వెంకట్రామ్, ఆచార్య పి.విశ్వనాథం, ఆచార్య ఉమాదేవి, డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, డాక్టర్ సురేష్, డాక్టర్ రంజిత్ కుమార్ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట నాగేశ్వర్ చలసాని

విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన

మునగపాక, న్యూస్‌టుడే: పుస్తక పఠనం చేసినంత మాత్రాన విద్యావంతులు కాలేరని, క్షేత్రస్థాయి పరిశీలనతో పూర్తిస్థాయిలో అవగాహన కలుగుతుందని ఏయూ అసిస్టెంటు ప్రొఫెసర్ రమేష్‌బాబు విద్యార్థులకు సూచించారు. ఏయూలో ఆర్కిటెక్ బ్రాంచి విద్యార్థులు మంగళవారం మునగపాకలోని ఫాల్జీబ్రిక్ పరిశ్రమలను సందర్శించారు. నాణ్యత తదితర వివరాలను పరిశ్రమ యజమాని ఆడారి అప్పలనాయుడును అడిగి తెలుసుకొన్నారు. అధ్యాపకులు రాజు, భాను, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇటుకల తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు


తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు

రెక్టార్ ఆకస్మిక తనిఖీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు మంగళవారం వర్సిటీలో పలు విభాగాలు ఆకస్మిక తనిఖీ చేశారు. జంతుశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, బయోకెమిస్ట్రీ, బోటనీ, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో సిబ్బంది హాజరు పట్టీలను, అక్కడ బోధన జరుగుతున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో ప్రతిభావంతులు

ఆరిలోవ, న్యూస్‌టుడే: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కె.భువనచంద్రిక (10వ తరగతి), ఎం.రేణుక (10వ తరగతి), ఎం శ్వేత (10వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయిని జి.కె.దుర్గాభవాని, క్లాస్ టీచర్ ఎం.అనురాధ చేతుల మీదుగా బహుమతులు అందించారు.


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు


విజేతలుగా నిలిచిన కె.భువనచంద్రిక, ఎం.రేణుక, ఎం.శ్వేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

ఫీజులు తగ్గించండి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గత ప్రభుత్వంలో పెంచిన ఫీజులు తగ్గించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎ.ఐ.ఎస్.ఎఫ్)కోరింది. ఈ మేరకు మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు వినతిపత్రం అందించింది. ఎ.ఐ.ఎస్.ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి నాగరాజు దూర ప్రాంతాల నుంచి వచ్చి వర్సిటీలో ఉన్నత చదువులు చదవాలని వచ్చిన విద్యార్థులు ఫీజులు కట్టలేకపోతున్నారన్నారు. ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విశ్వవిద్యాలయం నాయకులు అభిషేక్, చైతన్య, వికాస్, శివరామ్ రెడ్డి, రాము, శివరాజ్ కుమార్, శ్వేత, లలిత తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విమ్స్ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన రొమ్ము క్యాన్సర్ ఉచిత నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించింది. నగరంలోని పలుప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, డాక్టర్ భవాని, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యబృందం

బాలబాలికలకు అందుతున్న సేవలపై ఆరా..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: గ్రామీణ తహసీల్దారు కార్యాలయం పక్కన గల ప్రభుత్వ ప్రత్యేక బాలికల సదనాన్ని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ వెంకటశేషమ్మ మంగళవారం సందర్శించారు. అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఛైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎంఆర్.రాధ, కమిటీ సభ్యులు టి.విజయలక్ష్మి, ఎం.రజిని, కమిటీ ప్రతినిధులు, సదనం పర్యవేక్షణాధికారి ఏవీ సునీత, తదితరులు పాల్గొన్నారు.

✦ పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు సన్‌ఫ్లవర్ ప్రత్యేక పాఠశాలలో మంగళవారం ఉదయం సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ పర్యటించారు. మూగ, చెముడు బాలలకు యాజమాన్యం ఇస్తున్న శిక్షణల గురించి తెలుసుకున్నారు. అలాగే పెదజాలారిపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించారు. సన్‌ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.ఎన్.కుమారి, ప్రిన్సిపల్ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.


సౌకర్యాలపై ఆరా తీస్తున్న న్యాయమూర్తి వెంకట శేషమ్మ

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నవంబరు ఆరులోగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని చినగదిలి మండల తహసీల్దారు, సహాయ ఎన్నికల అధికారి ఎం.పాల్‌కిరణ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారికి దరఖాస్తు అప్పగించవచ్చని, ప్రైవేటు యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయ కౌంటర్ సంతకంతో కూడిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందించాలన్నారు. అలాగే సీఈఓ ఆంధ్ర వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చన్నారు.


తహసీల్దారు పాల్‌కిరణ్

23న బొకారో ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అల్పూజా-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 23న ఉదయం 6 గంటలకు బదులు 4.10గంటలు ఆలస్యంగా ఉదయం 10.10 గంటలకు బయలు దేరేలా మార్పు చేశారు.

ఆధార్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం

ఆరిలోవ, న్యూస్‌టుడే

ఆధార్ నవీకరణకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. అక్టోబరు 22 నుంచి 25 వరకు ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ నవీకరణ ప్రక్రియ జరుగుతోంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.


సంజయ్ గాంధీకాలనీ సచివాలయం 29లో ఆధార్ నవీకరణ ప్రక్రియ

15 సచివాలయాల్లో.. తూర్పు నియోజకవర్గంలో మొత్తం 15 సచివాలయాల్లో ఈ ప్రక్రియ జరుగుతోంది. చిరునామా, అనుసంధాన ఫోన్ నెంబర్లు మార్పు, తప్పుల సవరణ తదితర ప్రక్రియలకు అవకాశం కల్పిస్తున్నారు. వేలి ముద్రలు, కంటిపాప (ఐరిస్) నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులు, వయోవృద్ధులకు ఇది ఉపయోకరంగా ఉంది. చిరునామా నిర్ధారణకు రేషన్ కార్డు, ఓటర్ కార్డు, పాన్‌కార్డు తీసుకు వెళ్లాలి. పాత ఆధార్ కార్డు ఆధారంగా అవసరమైన మార్పులు చేసి నవీకరిస్తున్నారు. ఆరిలోవ ప్రాంతానికి తోటగరువులోను, కొండవాలు ప్రాంతాలకు సంజయ్‌గాంధీ కాలనీ సచివాలయంలోను వీటిని ఏర్పాటుచేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు పనిచేస్తున్నాయి. అక్టోబర్ 25 వరకు గడువు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

సచివాలయాల్లో ఆధార్ నవీకరణకు శిబిరాలు



సచివాలయంలో వృద్ధురాలి ఐరిస్ తీసుకుంటున్న ఉద్యోగి

మాధవధార, న్యూస్‌టుడే: ఆధార్ నవీకరణకు సంబంధించి పలు సచివాలయాల్లో మంగళవారం ప్రత్యేక శిబిరాలను ప్రారంభించారు. కొత్తగా పేర్ల నమోదు, చిరునామాల్లో మార్పులు, చేర్పులు, ఫోన్ నెంబర్ల సవరణ, బయోమెట్రిక్ వంటి చేసుకోవచ్చునని అధికారులు తెలియజేశారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులకు ఆధార్‌లో మార్పులకు ఇదొక మంచి అవకాశమన్నారు. ఈ నెల 25 వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-11 బృందావన్ పార్కు ప్రాంగణంలో ఉన్న వార్డు సచివాలయంలో మంగళవారం ఆధార్ క్యాంప్ ప్రత్యేక సేవలు ప్రారంభించారు. సుమారు 25మంది ఈ సేవలు వినియోగించుకున్నారని సచివాలయం కార్యదర్శి నరేంద్ర తెలిపారు.

పాత పద్ధతిలోనే పాలసీలను కొనసాగించాలి

గురుద్వారా, న్యూస్‌టుడే: పాత పద్ధతిలోనే పాలసీలను కొనసాగించాలని ఎల్ఐసీ సీతమ్మధార శాఖ ఏజెంట్ల సంఘ కార్యదర్శి రాంబోతు అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం సీతమ్మధార శాఖ దరి ఎల్ఐసీ ఏజెంట్లు నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ తొలగించి, బోనస్‌లు, ఏజెంట్ల కమిషన్ పెంచాలన్నారు. నిరసనలో కోశాధికారి కె.వి.రమణమూర్తి, ఇల్లిపల్లి శ్రీనివాస్, మాధవి, శ్రీనివాస్, నర్సింగరావు, దినేశ్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఎల్ఐసీ ఏజెంట్లు

వెలగని వీధి దీపాలు

ఫోకస్

మాధవధార, న్యూస్‌టుడే

జీవీఎంసీ 49,50,51,53,54,55 వార్డుల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ పరిస్థితి దయనీయంగా మారింది. కొన్ని నెలలుగా వీధి దీపాల నిర్వహణకు సంబంధించి ఎటువంటి నిధులు విడుదల కాకపోవడంతో చాలా చోట్ల వాటి నిర్వహణ లేక అంధకారం నెలకొంది. ప్రతి వార్డులోని చాలా కాలనీల్లో వీధి దీపాలు మూలకు చేరాయి. చాలా చోట్ల పాడైన దీపాల స్థానంలో కొత్తవి అమర్చక లేదు, మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఈ వార్డులు ఒక వైపు కొండవాలును ఆనుకుంటూ ఉండటంతో పాటు, శివారు ప్రాంతాలైన ఎన్‌జీజీఓఎస్ కాలనీ, మురళీనగర్, మాధవధార, కళింగనగర్, వుడా కాలనీ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా అంధకారం నెలకొంటోంది. దీంతో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకునే నాథుడే లేరు: ఇప్పటి వరకు వీధి దీపాల నిర్వహణ గురించి గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏ సంస్థకు అప్పగించలేదు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం కూడా వీధి దీపాల నిర్వహణను ఇప్పటి వరకు ఎవరికీ అప్పగించలేదు. వీధి దీపాల నిర్వహణకు ఒక వైపు గుత్తేదార్లు లేక, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతి వార్డులో ప్రధాన ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. వర్షం, గాలి వస్తే, విద్యుత్తు తీగలు చెట్లను తాకడం, వేలాడుతున్నవి, కిందకు ఉన్నవి కలిసిపోవడంతో వీధి దీపాలు ఎక్కువగా పాడవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో చాలా వరకు వీధి దీపాలు పాడైపోయాయి. హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లు గాలులకు కలిసిపోయి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి వీధి దీపాలు చాలా చోట్ల కాలిపోయాయి. పలుమార్లు జీవీఎంసీ అధికారులకు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రజలు వాపోతున్నారు.



సీతన్నగార్డెన్స్‌లో వీధి దీపాలు మరమ్మతులకు గురవ్వడంతో నెలకొన్న అంధకారం





వుడా కాలనీలో, మాధవధార ప్రధాన రహదారి కొత్త మహాలక్ష్మి ఆలయం వద్ద పాడైన హైమాస్ట్ దీపాలు

వార్డుల్లో ఇదీ పరిస్థితి

ఆరు వార్డుల్లో మొత్తం వీధి దీపాలు	: 2874
వెలగని దీపాలు	: 968
మరమ్మతులకు గురైనవి	: 1136

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

సమస్య: కాన్వెంట్ కూడలి చావలమదుం వద్ద రహదారి ఛిద్రమైంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.. – కండేల రాజు, భూపేష్‌నగర్

మేమున్నాం.. మీకు తోడుగా
10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

సమాధానం: రహదారి నిర్మాణం టెండర్ల ప్రక్రియలో ఉంది. త్వరలో పనులు చేపడతాం. –ఏఈ, సతీష్

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గురుద్వారా, న్యూస్‌టుడే: వీబార్ట్ ట్రస్టు, విశాఖ కంటి ఆసుపత్రి ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో టీపీటీకాలనీ ఎన్ఎంసీ హెచ్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులందరికీ దృష్టి సామర్థ్య పరీక్షలు చేసి తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కలుగజేశారు. కంటి అద్దాలు, చిన్నపాటి శస్త్రచికిత్స వంటి వాటిని ట్రస్టు చేయిస్తుందన్నారు. బాలప్రాయపు అంధత్వ నివారణే ధ్యేయంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఈ.సాయికృష్ణ, వైద్య సిబ్బంది కె.లిఖిత, బి.వాసుప్రసాద్, బి.మమత, ఏఎన్ఎం డి.అనురాధ, ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్వాడీలో బాలలకు..

గురుద్వారా, న్యూస్‌టుడే: రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం 24వ వార్డు నక్కవానిపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మాటలు సరిగా రాని చిన్నారులు, తరచూ అనారోగ్యానికి గురవుతున్న పిల్లలను వైద్యాధికారి మన్మోహన్ పరిశీలించి తీసుకోవల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. చిన్న వయస్సులోనే వ్యాధిని గుర్తించి తగు చికిత్స అందిస్తే భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. ఎంపీహెచ్ఎస్ఎఫ్ డి.ఎస్.మణి, ఏఎన్ఎం ఎస్.కృష్ణవేణి, పి.భవానీ, అంగన్వాడీ సిబ్బంది బి.గౌరీ, కె.కోమలి, తదితరులు పాల్గొన్నారు.



తల్లులకి సూచనలిస్తున్న వైద్యాధికారి మన్మోహన్, చిత్రంలో అంగన్వాడీ సిబ్బంది

విద్యార్థుల రక్తదానం

సీతంపేట, న్యూస్‌టుడే : 25వ వార్డులోని రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాల విద్యార్థులు రక్తదానం శిబిరంలో పాల్గొని 131 యూనిట్ల రక్తదానం చేశారు. కరస్పాండెంట్ డి.సత్యనారాయణ రెడ్డి స్వయంగా రక్తదానం చేయడంతో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చారు. రోటరీ క్లబ్ సహకారంతో ఎ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ వైద్యుల పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ విద్యా రాఘవేంద్ర, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు డాక్టర్ ఎ.సుగుణ, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ప్రిజమ్ కళాశాల విద్యార్థులు

కేన్సర్లపై ప్రజలకు అవగాహన

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-11 జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల దగ్గర ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం టాటా మెమోరియల్ ఆసుపత్రి అనుబంధ హోమీబాబా కేన్సర్ ఆసుపత్రి నిర్వాహకులు కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు నమిత, శ్రీలత మాట్లాడుతూ ఈ క్యాంప్ కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, అవగాహన కల్పించడం కోసం ఉద్దేశించిన కీలకమైన కార్యక్రమమని అన్నారు. ఈ శిబిరంలో బ్రెస్ట్, సర్వైకల్, పొట్ట, ప్రొస్టేట్ కేన్సర్లతో సహా వివిధ రకాల కేన్సర్లపై విలువైన ఆరోగ్య సంబంధిత సలహాలను వివరించారు. సుమారు 200మందికి కేన్సర్ నివారణ, ముందస్తు హెచ్చరిక సంకేతాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు స్వర్ణలత, సహాయ బృందం, 50వ వార్డు కూటమి నేతలు సనపల వరప్రసాద్, తమ్మినేని పద్మజ, కాలనీవాసులు పాల్గొన్నారు.



చిత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆధునికీకరిస్తామని తవ్వి వదిలేశారు..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఆధునికీకరిస్తామని రహదారి పక్కనున్న వీధి కాల్వలు తవ్వారు.. తర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా వదిలేశారు. 26వ వార్డు అక్కయ్యపాలెం సంగంఆఫీసు కూడలి నుంచి శంకరమఠం రోడ్డు రామకృష్ణా ప్రింటర్స్ కూడలికి వెళ్లే దారి ఇరు పక్కలా ఉన్న వీధి కాల్వలను జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రెండు నెలల కిందట తవ్వించారు. అయితే ఆ తర్వాత పనులను మధ్యలోనే నిలిపివేశారు. దాంతో తవ్విన వ్యర్థాలన్నీ కొంతకొంతగా తవ్విన కాల్వల్లోనే పడుతుండడంతో అందులో చెత్త చెదారాలు నిలిచిపోయి మురుగునీరు సజావుగా పారడం లేదు. దీంతో తీవ్రమైన దుర్గంధం వెదజల్లి దోమలు పెరిగి ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందంటూ అక్కడి నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సంగంఆఫీసు కూడలి నుంచి శంకరమఠం రోడ్డుకు వచ్చే దారిలో కాల్వలు తవ్వి వదిలిపెట్టిన దృశ్యం

శిరస్త్రాణం ప్రాధాన్యతపై ర్యాలీ

గురుద్వారా, న్యూస్‌టుడే: మెక్డోనాల్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో శిరస్త్రాణం ప్రాధాన్యతపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శిరస్త్రాణం, బ్యానర్లతో ద్వారకానగర్ ట్రాఫిక్ కూడలి నుంచి డైమండ్ పార్కు, మీదుగా మద్దిలపాలెం వరకు ర్యాలీ చేశారు. శిరస్త్రాణం ధరించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని నిర్వాహకులు దిల్లీశ్వరరావు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించామన్నారు.



శిరస్త్రాణం, బ్యానర్లతో ర్యాలీ చేస్తున్న బృందం

ఎమ్మెల్యే సభ్యత్వ నమోదు

గురుద్వారా, న్యూస్‌టుడే: ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యుడు, భాజపా ఫ్లోర్‌లీడర్ పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం ఆయన నివాసంలో భారతీయ జనతా పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, అరకు పార్లమెంటు నియోజకవర్గం బాధ్యుడు పరశురామరాజు, పలువురు నాయకులు మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఆ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నార్త్ నియోజకవర్గం బాధ్యుడు సురేశ్‌బాబు, బుద్ధా నాని, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా నాయకుల చేతులమీదుగా రసీదును అందుకుంటున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

శంకరన్ ఆశయాల్ని ముందుకు తీసుకువెళ్లాలి

సీతంపేట, న్యూస్‌టుడే : దళితులు ఐక్యంగా మాజీ ఐ.ఎ.ఎస్.అధికారి ఎస్.ఆర్.శంకరన్ ఆశయాల్ని ముందుకు తీసుకువెళ్లాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు అన్నారు. విశాఖ దళిత సంఘం (విదసం) ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ పౌరగ్రంథాలయంలో ఎస్.ఆర్.శంకరన్ 90వ జయంతి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఐ.ఏ.ఎస్. స్టడీ సర్కిల్ పెట్టి దళితుల సివిల్ సర్వీస్ చదువులకు శంకరన్ ఎంతో దోహద పడ్డారన్నారు. రాష్ట్రంలో తొలిసారి రెసిడెన్షియల్ పాఠశాలలు పెట్టి దళితులకు విద్య చేరువ చేశారని కొనియాడారు. విశ్రాంత పోస్టు మాస్టర్ జనరల్ ముత్యాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి అధికారికి ఎస్.ఆర్.శంకరన్ రోల్ మోడల్ అన్నారు. ప్రజల కోసం సంసార జీవితాన్ని త్యాగం చేసి తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారన్నారు. విదసం అధ్యక్షులు బూసి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, రెసిడెన్షియల్ సొసైటీ జిల్లా సమన్వయ అధికారి రూపవతి, హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

వాయు సైనిక్ క్యాంప్‌లో ప్రతిభ

సీతంపేట, న్యూస్‌టుడే : గత నెల 26 నుంచి ఈనెల 7వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించిన 2024-25 ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంప్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎన్.సి.సి. విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుల్లయ్య ఇంజినీరింగ్ ఎయిర్ వింగ్ విద్యార్థులు ఎన్.భవ్య హరిణి స్కీట్ షూటింగ్‌లో పాల్గొని కాంస్య పతకాన్ని, ఎస్.నవీన్ రేడియో కంట్రోల్ ఏరోబేటిక్స్‌లో పాల్గొని రజత పతకాన్ని సాధించారు. బి.మౌళి ప్రియ ఏరోమోడలింగ్ కంట్రోల్ లైన్ ఏరోబేటిక్స్‌లో పాల్గొనగా డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.భాగలక్ష్మి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కాంటిజెంట్ కమాండర్‌గా వ్యవహరించింది. ఈ సందర్భంగా కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ విద్యార్థులను అభినందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె. చక్రవర్తి, ఫ్లైట్ లెఫ్టినెంట్ డాక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణ రెడ్డి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ తదితరులు

'మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు'

సీతంపేట, న్యూస్‌టుడే : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు అంధకారమవుతాయని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆబ్కారీ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.జగదీశ్వరరావు అన్నారు. సీతంపేటలోని కాళ్ళప్ డిగ్రీ కళాశాలలో ఆయన మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల కన్న కలలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.జోత్స్న రెడ్డి మాట్లాడుతూ యువత తమ అభిరుచులు, ఆసక్తులు గమనిస్తూ ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా నిధులు అందజేత

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన గుర్రం సత్యనారాయణ కుటుంబానికి బీమా నిధులు రూ.4.90 లక్షలు మంజూరయ్యాయి. జీవీఎంసీ నాన్ పీహెచ్ ఎంప్లాయిస్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు వామనరావు మంగళవారం మృతుని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. సత్యనారాయణ సొసైటీలో సభ్యుడు కావడంతో ఆయన తీసుకున్న రుణాన్ని మాఫీ చేసినట్లు వామనరావు తెలిపారు. సొసైటీ కార్యదర్శి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్మికుని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న వామనరావు

సెల్లార్లలో నిర్మాణాలు.. రహదార్లపై వాహనాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

విశాఖ నగరంలో వాణిజ్య సముదాయాలు, భారీ నివాస సముదాయాల ముందు ద్విచక్రవాహనాలను నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాదచారుల సౌకర్యార్థం జీవీఎంసీ నడక మార్గాలను అభివృద్ధి చేసింది. అయితే రహదారి కంటే కాస్త ఎత్తులో నడక మార్గాలు ఉండటంతో భవనాల సెల్లార్లలోకి వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో ద్విచక్రవాహనాలు, కార్లను సైతం రహదారి పక్కనే నిలిపివేస్తున్నారు. గంటల తరబడి వాటిని అక్కడే ఉంచడంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలగడంతో పాటు, ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, ఆశీలుమెట్ట తదితర ప్రాంతాలలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. కీలకమైన వీఐపీ రహదారి, జగదాంబ-సిరిపురం రహదారిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డు పక్కనే వాహనాలు ఉంటున్నాయి. సెల్లార్లను వినియోగించకపోవడంతో వాటిలోనూ నిర్మాణాలు చేపట్టి వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి సెల్లార్ పార్కింగ్‌ను ప్రోత్సహించాల్సి ఉంది.



జగదాంబ-సిరిపురం రహదారిలో నిలిపిన ద్విచక్రవాహనాలు

తణుకు టీడీఆర్ బాండ్ల రద్దుతో తీవ్ర నష్టాలు

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: తణుకు టీడీఆర్ బాండ్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించి నిర్మాణ రంగానికి చేయూత ఇవ్వాలని ఏపీ టీడీఆర్ బిల్డర్ల సంఘం ప్రతినిధి రాజశేఖర్ కోరారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తణుకులో టీడీఆర్ బాండ్ల జారీలో ఉల్లంఘనలు, మోసం జరిగిందని పేర్కొంటూ గత ప్రభుత్వం 2022 సంవత్సరంలో బాండ్లను బ్లాక్ చేసిందన్నారు. దీనిపై తాము ఏపీ హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. కోర్టు ఈ ఏడాది మార్చి 19న టీడీఆర్ అంశంపై 2నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించిందన్నారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యమైందన్నారు. అక్టోబరు 14న కూటమి ప్రభుత్వం 29 తణుకు టీడీఆర్ బాండ్లను రద్దు చూస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోయినట్లు చెప్పారు. ఈ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా బిల్డర్లు చేపట్టిన 1800 ప్రాజెక్టులు ఆగిపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘం ప్రతినిధులు ఎ.సాయి ఆనంద్, ఎన్.శ్రీధర్, జి.బి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏపీ టీడీఆర్ బిల్డర్ల సంఘం ప్రతినిధులు



మాట్లాడుతున్న శ్రీనివాస్ ఉల్లిశెట్టి

'ఎంత పని చేసావ్ చంటి' సినిమా అలరిస్తుంది..

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: 'ఎంత పని చేసావ్ చంటి' సినిమా ప్రేక్షకులను అలరిస్తుందని హీరో ఉల్లిశెట్టి శ్రీనివాస్ అన్నారు. డాబాగార్డెన్స్ దరి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమం నిర్వహించారు. హీరో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడవాళ్లకు మాత్రమే అనే ట్యాగ్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. చిత్రీకరణ మొత్తం విశాఖలోనే పూర్తి చేసినట్లు చెప్పారు. దీనికి ఉదయ్ కుమార్ దర్శకత్వం, పవన్ సిద్ధార్థ్ సంగీతం అందించారని పేర్కొన్నారు. సినిమా యూనిట్ సభ్యులు జి.వి.త్రినాథ్, అమ్మరాజ్, దియారాజ్, నిహారిక కేశవ, శంకరరావు, ఆర్.వి.వి.సత్యనారాయణ, గోవిందరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 29న విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న పులగం రామచంద్రారెడ్డి

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: విశాఖలో డిసెంబరు 29న ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు పులగం రామచంద్రారెడ్డి తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సినీ రంగంలోని 24 విభాగాల్లో పనిచేస్తున్న కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సినీరంగ ప్రముఖులు, దర్శకులు, నటులు హాజరవుతారని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు హెచ్‌ఆర్.దిలీప్‌కుమార్, సత్యనారాయణ, కుమార్‌నాయక్, శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణంపై నిరసన

అల్లిపురం, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను తరలించాలని ఐద్వా అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. చావలమదుం భూపేష్‌నగర్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి వ్యతిరేకంగా స్థానిక మహిళలు చేపడుతున్న ఆందోళనకు మంగళవారం ఐద్వా నాయకులు సంఘీభావం తెలియజేశారు. పద్మ మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంతంలో మహిళలకు రక్షణ లేదని, మద్యం దుకాణంతో పరిస్థితి మరింత దిగజారుతుందన్నారు. స్థానికురాలు హుస్సేన్‌బీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మసీదు, చర్చి, జీవీఎంసీ నిరాశ్రయుల భవనం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని మరో చోటుకు తరలించాలని కోరారు. ఐద్వా నాయకులు సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఐద్వా ప్రతినిధులు, మహిళలు

ఆదాయపన్ను నిధులు వెనక్కివ్వాలని వినతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి మినహాయించిన ఆదాయ పన్ను నిధులను వెనక్కి ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ వద్ద ఆందోళన నిర్వహించి కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులు ఆదాయపన్ను పరిధిలోకి రాకపోయినా జీతాల నుంచి మినహాయించారన్నారు. వెనక్కి వచ్చిన నిధులను కార్మికుల ఖాతాలలో జమ చేయాల్సి ఉండగా, మహిళా సంఘాల ఖాతాల్లో జమచేశారన్నారు. తక్షణమే నిధులు వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.



కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

తోపుడుబళ్లు తొలగించడం అన్యాయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రైల్వే అతిథిగృహం నడక మార్గంపై ఉన్న 23 తోపుడుబళ్లను తొలగించడం అన్యాయమని సీఐటీయూ జోన్ కార్యదర్శి పి.వెంకటరావు అన్నారు. తక్షణమే తొలగించిన బళ్లను యథావిధిగా కొనసాగించాలని జిల్లా తోపుడుబళ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం కోరారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఎవరో వ్యక్తి ఎక్స్ ఖాతాలో తోపుడుబళ్లపై చేసిన వ్యాఖ్యలను అధికారులు పరిగణనలోకి తీసుకుని పేదలకు ఉపాధిని దూరం చేయడం సరికాదన్నారు.



ఆందోళనలో పాల్గొన్న తోపుడుబళ్ల కార్మికులు

23న బొకారో ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: సాంకేతిక కారణాలతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు (రీ షెడ్యూల్) వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీటి బెంగళూరు-అగర్తలా(12503) రైలు ఈనెల 22 ఉదయం 10.15 గంటలకు బదులు 9.45 గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు.. అల్ప్పాజా-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 23న ఉదయం 6 గంటలకు బదులు 4.10గంటలు ఆలస్యంగా ఉదయం 10.10 గంటలకు బయలు దేరేలా మార్పు చేశారు.

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని వేడుకగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.


వధూవరుల అలంకరణలో స్వామి, అమ్మవార్లు

నేడు జరగాల్సిన ఈసీ వాయిదా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బుధవారం జరగాల్సిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం వాయిదా వేసినట్లు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉండడంతో వాయిదా వేయాలని ఉన్నత విద్యామండలి సూచించినందున వాయిదా వేశామన్నారు. ఎప్పుడు నిర్వహించేది తర్వాత తేదీ నిర్ణయించనున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం (88వ వార్డు) గంగవరానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సబ్బవరం సీఐ పిన్నింటి రమణ చెప్పిన వివరాల ప్రకారం.. గంగవరానికి చెందిన బాలిక ఓ తరగతి చదువుతోంది. ఈనెల 19న ఉదయం స్కూలుకు వెళ్లి వస్తానని చెప్పి, తిరిగి రాకపోవడంతో తండ్రి సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

శిక్షణ.. భవితకు రక్షణ

కేంద్రాల్లో దివ్యాంగ బాలలకు డిజిటల్ విద్యాబోధన


ట్యాబ్‌లో బోధన సాగిస్తూ..

న్యూస్‌టుడే, గోపాలపట్నం

దివ్యాంగ చిన్నారులకు వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలు నిర్వహిస్తుంది. శారీరంగా అవసరమైన ఫిజియోథెరపీ ప్రక్రియ కొనసాగిస్తూనే, డిజిటల్ యంత్రాలతో విద్య నేర్పిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు.

విశాఖ జిల్లాలో మొత్తం 11 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో సుమారు 230 మంది చిన్నారులు విద్యాబుద్ధులు అభ్యసిస్తున్నారు. జిల్లాలో వారికి అవసరమైన ట్యాబ్‌లు సమకూర్చారు. విద్యాసంబంధిత యాప్‌లు డౌన్‌లోడ్ చేయించి, నిపుణులైన సిబ్బందితో శిక్షణ అందిస్తున్నారు. ఉపాధ్యాయుల బోధన తీరుతో పాటు, విద్యార్థుల ప్రగతి ఎప్పటికప్పుడు నమోదయ్యేలా ఏర్పాటు చేశారు. ఆయా అంశాలను ఉన్నతాధికారులు సమీక్షించే వీలుంటుంది.

చదువు సాగేలా..: గోపాలపట్నం సమీప లక్ష్మీనగర్ మండల ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో జిల్లా భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. మొత్తం 20 మంది చిన్నారులు ఉన్నారు. వారిలో వినికిడి సమస్య, కంటిచూపు సరిగా లేనివారు, ఇతర అవయవాలు సరిగా పని చేయక ఇబ్బందిపడే వారు ఉన్నారు.

● ఇక్కడి కేంద్రంలో ఉపాధ్యాయులకు రెండు ట్యాబ్‌లు ఇచ్చారు. మొత్తం 32 యాప్‌ల సాయంతో దివ్యాంగ చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు. చదువుతో పాటు, ఇతర పనులు సులువుగా చేసుకునేందుకు ఈ యాప్‌లు ఉపకరిస్తున్నాయి. డిజిటల్ విద్యాబోధనతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రణాళిక అమలు చేస్తుంది.


వ్యాయామంలో మెలకువలు నేర్పిస్తూ..

ఇదీ పరిస్థితి..

➤ చిన్నారులకు అందించిన ట్యాబ్‌లో గూగుల్ ఫ్యామిలీ లింక్ యాప్ ఉంది. దీని ద్వారా భవిత కేంద్రంలో, బయట జరుగుతున్న బోధనపై నిరంతరం నిఘా పరిశీలన చేసే వీలుంటుంది.

➤ కేంద్రంలో చిన్నారులకు నెలలో ఆరుసార్లు ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. బోధన సమయంలో బాలలతో సంభాషించడం, మాట్లాడించడంతో పాటు, ఇతర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

➤ ట్యాబ్‌ల వాడకంతో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఏర్పడుతుంది. వినికిడి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు గూగుల్ ఫ్యామిలీ యాప్ బాగా ఉపకరిస్తుందని శిక్షకులు చెబుతున్నారు.





సద్వినియోగం చేసుకోవాలి..: గతంలో దివ్యాంగ చిన్నారులకు ప్రత్యేక పాఠశాలలు ఉండేవి. ఇప్పుడు వాటికి బదులుగా భవిత కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ పాఠశాలల్లో చదుకునే విద్యార్థుల్లానే... ఇక్కడి కేంద్రాల్లోనూ చదువుకునే వీలుంటుంది. నిపుణులతో నిర్వహిస్తున్న కేంద్రాలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలి. –కె.దివాకర్, గోపాలపట్నం, ఎంఈఓ

బాల మేధస్సుకు పరీక్ష





గాజువాక సమీప శ్రీనగర్ శ్రీరామవేంద్ర పాఠశాల విద్యార్థులకు మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతులకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశాలను తమదైన శైలిలో, వివిధ కోణాల్లో విశ్లేషించారు. ప్రతిభ చూపిన ఇమ్మానుయేల్ హల్లిమహన, దంతులూరి హేమ, వేదాద్రి రేష్మిల పాఠశాల ప్రిన్సిపల్ వల్ల రమ్య చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. –న్యూస్‌టుడే, గాజువాక

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం


బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. మంగళవారం గోపాలపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తనిల్వల విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు క్షతగాత్రులకు అవసరమైన రక్త నిల్వలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య సిబ్బంది నియామకాలు చేపడతామన్నారు. అనంతరం ప్రసూతి విభాగంలో బాలింతలు, గర్భిణులతో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. డీసీహెచ్ఎం శంకరప్రసాద్, సూపరింటెండెంట్ సుజాత, వైద్యులు నివేదిత, పూర్ణిమ, వల్లం, రేవతి పాల్గొన్నారు.

సింధియా(నైహరునగర్), న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం 59వ వార్డు మాజీ సైనికుల కాలనీ సమీప వెల్నెస్ కేంద్రాన్ని మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సందర్శించారు. కేంద్రంలో వసతులు, బాలల సంఖ్య, వారికి అవసరమైన పరికరాలు, నిర్వహణ.. తదితర అంశాలపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించి.. కేంద్రం అభివృద్ధికి చేయూత ఇస్తామన్నారు. ఆయన వెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రతినిధులు, స్థానిక తెదేపా కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.


59వ వార్డు కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య	గాజువాక: 98494 65088
	పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

?: కణితిరోడ్డు సమీప శివాలయం వెనుక సనత్‌నగర్ వీధిలో 85ఏ-9-6 వీధి దీపం నెలల తరబడి వెలగడం లేదు. ఇదే పరిస్థితి సిద్ధేశ్వరం నుంచి వెంపల్లినగర్ వెళ్లే మార్గంలోనూ ఉంది. –రవీంద్ర, సనత్‌నగర్

–సత్యం, పెదగంట్యాడ

✔: మరమ్మతులకు గురైన దీపాలను పునరుద్ధరిస్తాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

?: వుడారోడ్డులో అన్నక్యాంటీన్ వద్ద చెట్ల కొమ్మల్ని నరికి రోడ్డు పక్కన పడేశారు. వెంటనే వాటిని తరలించాలి.

–తవిటినాయుడు, వుడారోడ్డు

✔: సిబ్బందిని పంపి తొలగిస్తాం.

–డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ఆరా

అగనంపూడి, న్యూస్‌టుడే: జీవీఎంసీ కార్పొరేటర్లు మంగళవారం బెంగళూరు నగరాన్ని సందర్శించారు. అధ్యయన యాత్రలో భాగంగా అక్కడి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న అనేక అంశాలను పరిశీలించారు. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాలో అవలంబిస్తున్న విధానాలపై ఆరా తీసినట్లు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. పర్యటనలో జీవీఎంసీ తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాస్, కార్పొరేటర్లు బొండా జగన్, గల్లా చిన్నా తదితరులు పాల్గొన్నారు.


బెంగళూరు పర్యటనకు వెళ్లిన కార్పొరేటర్లు

సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శ్యాంబాబు

ఉక్కునగరం(కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యం ఇచ్చేలా దేశ ప్రధాని మోదీ ప్రకటించిన సోలార్ రూఫ్‌టాప్ పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులు సూచించారు. ఈ అంశంపై ప్రజలకు వివరించేందుకు మంగళవారం కూర్మన్నపాలెం సమీప ముస్తఫాకూడలిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో విద్యుత్తు ఎస్ఈ శ్యాంబాబు పాల్గొన్నారు. నూతన పథకం ప్రయోజనాలు వివరించి, వినియోగదారుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఈఈ బి.కె.నాయుడు, ఏడీఈ రామకృష్ణ, రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సభ్యత్వ నమోదు : భాజపా


సభ్యత్వాలు అందజేస్తున్న రవీంద్ర, నర్సింగరావు తదితరులు

గాజువాక, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా భాజపా సభ్యత్వ నమోదులో విశాఖ జిల్లా మొదటి స్థానంలో ఉందని పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. మంగళవారం గాజువాక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గాజువాకలోనూ అధికంగా సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ... నమోదుకు సహకరిస్తున్న కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. పార్టీ నాయకులు బుద్ధా లక్ష్మీనారాయణ, దీనంకొండ కృష్ణంరాజు, పొలిమేర శ్రీను, బొండా యల్లాజీరావు, గూటూరు శంకర్, వర్రె లలిత తదితరులు మాట్లాడారు. అనంతరం పలువురు భాజపాలో చేరారు.

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం): భాజపా బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని నగర పార్టీ అధ్యక్షుడు కె.రవీంద్రరెడ్డి అన్నారు. మంగళవారం బుచ్చిరాజుపాలెంలోని పశ్చిమ భాజపా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి క్రియాశీల సభ్యత్వాలు అందించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ పశ్చిమ ఇన్‌ఛార్జి దాడి పురుషోత్తమ రమేశ్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో నాయకులు జీసీ.నాయుడు, సంతోశ్‌కుమార్‌సింగ్, రామకృష్ణ, పి.శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు గాయాలు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారం వాటర్ మేనేజ్‌మెంట్ విభాగంలో(డబ్ల్యూఎండీ) మంగళవారం జరిగిన ప్రమాద ఘటనలో ఇద్దరు శాశ్వత ఉద్యోగులు, మరో ఒప్పంద కార్మికుడు గాయపడినట్లు విభాగం ఉద్యోగులు తెలిపారు. ఆ వివరాలు... కర్మాగారంలోని అప్పికొండ గేటు సమీపంలోని పంప్‌హౌస్-23లో విద్యుత్తు సంబంధిత మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో పల్లం గోపి, ఠాగూర్, గరికిన దేవుడుకు గాయాలయ్యాయి. వారిని స్టీల్ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్టు కార్మికులు తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

గోపాలపట్నం, న్యూస్‌టుడే: సమాజంలో అంతరించిపోతున్న కళలు, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలని గోపాలపట్నం కళా సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.సోములు అన్నారు. మంగళవారం సంఘ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో ఉన్న కళాకారులను గుర్తించి సంఘం తరఫున ప్రోత్సహించాలన్నారు. సభ్యులు జి.రామదాసు, సీహెచ్.సుబ్బారావు, అప్పారావు, వెంకట్, శ్రీనివాస్, రమణారావు, నారాయణరావు, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.సోములు

సంక్షిప్త సమాచారం..

బాణసంచా దుకాణాలకు 38 దరఖాస్తులు

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురంలో బాణసంచా విక్రయాలకు సంబంధించి మంగళవారం 38 మంది దరఖాస్తులు అందించారు. ఆయా దరఖాస్తుల్ని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక, విద్యుత్తు, అగ్నిమాపక, పోలీసు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పరిశీలన చేశారు. ఆ తర్వాత దుకాణాల ఏర్పాటుకు అనుమతి పత్రాలు జారీ చేస్తారు.

ఘనంగా పోలమ్మ తల్లి పండగ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడ నెల్లిముక్కు గ్రామదేవత పోలమ్మతల్లి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కోలాటాలు, సాముగరడీలు, మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కమిటీ సభ్యులు పులి వెంకటరమణారెడ్డి, చిన పెంటయ్యరెడ్డి, శ్రీరాములురెడ్డి, పెరుమాళ్లరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆదాయపన్ను నిధులు వెనక్కి ఇవ్వాలి'

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి మినహాయించిన ఆదాయపన్ను నిధులను వెనక్కి ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ వద్ద ఆందోళన నిర్వహించి కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులు ఆదాయపన్ను పరిధిలోకి రాకపోయినా జీతాల నుంచి మినహాయించారన్నారు. వెనక్కి వచ్చిన నిధులను కార్మికుల ఖాతాలలో జమ చేయాల్సి ఉండగా, మహిళా సంఘాల ఖాతాల్లో జమచేశారన్నారు. తక్షణమే నిధులు వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.

23న బొకారో ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: సాంకేతిక కారణాలతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు (రీ షెడ్యూల్) వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీటి బెంగళూరు-అగర్తలా(12503) రైలు ఈనెల 22 ఉదయం 10.15 గంటలకు బదులు 9.45 గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు.. అల్ప్పూజా-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 23న ఉదయం 6 గంటలకు బదులు 4.10గంటలు ఆలస్యంగా ఉదయం 10.10 గంటలకు బయలు దేరేలా మార్పు చేశారు.

గాజువాక సినిమాలు..

కన్య: **దేవర**, హెవెన్: జనక **అయితే** గనక.., శ్రీకన్య: లక్ష్మి: హెవెన్: అరుణ (పెదగంట్యాడ): అన్నపూర్ణ (కూర్మన్నపాలెం): **వేట్టయాన్**, మోహినీ 70ఎంఎం: విశ్వం, లక్ష్మీకాంత్: శ్వాగ్, మినీ మోహినీ: **మార్టిన్**, మోహినీ: జిగ్రా, విశేష్: మా నాన్న సూపర్ హీరో

గోపాలపట్నంలో: శ్రీనరసింహా: జనక **అయితే** గనక, నరసింహా: **వేట్టయన్**, సౌజన్య: విశ్వం, సుకన్య: **దేవర**, మౌర్య: **మార్టిన్**

స్తంభాలపై పాదుల తొలగింపు



జీవీఎంసీ 90, 92 వార్డుల పరిధి లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్, పద్మనాభనగర్‌లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలపై పచ్చని పాదులు అల్లుకున్నాయి. ఈ సమస్యపై సోమవారం 'ఈనాడు'లో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు అధికారులు పద్మనాభనగర్‌లో విద్యుత్తు సంభంపైకి పాకిన పాదుల్ని తొలగించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ పనులు చేయిస్తామని చెప్పారు.

–న్యూస్‌టుడే, గోపాలపట్నం (ఆర్.ఆర్.వి.పురం)

ఈనాడు కథనానికి స్పందన



క్లిక్ క్లిక్

హానికర వ్యర్థం.. తీవ్ర అనర్థం..!

జీవీఎంసీ 85వ వార్డు గొన్నవానిపాలెం చెరువు స్థలంలో హానికర రసాయన వ్యర్థాలు పారబోస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఫిర్యాదులు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. అయిదేళ్ల కిందట కాలనీకి ఆనుకుని ఏపీఐఐసీ పరిశ్రమల పార్కు ఏర్పాటైంది. ఆయా యూనిట్లలోని ఔషధ, హానికరమైన వ్యర్థాల్ని ప్రత్యేక ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాల్సి ఉంది. అయినా కొందరు నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాల్లో వ్యర్థాల్ని తీసుకొచ్చి చెరువు స్థలంలో పడేస్తున్నారు. గుట్టలుగా పేరుకున్న వ్యర్థాల నుంచి తీవ్ర దుర్వాసనతో పాటు, చెరువు నీటితో కలిసిపోయి భూగర్భంలోకి ఇంకిపోతున్నాయని నివాసితులు చెబుతున్నారు. ఇప్పటికైనా పీసీబీ, ఏపీఐఐసీ అధికారులు స్పందించి వ్యర్థాల డంపింగ్‌ను నిరోధించాలని వారు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, అగనంపూడి

ఆశ్రయం కల్పించి... ఉపాధి చూపించి..!


ప్రైవేటు ఆసుపత్రి వద్ద నానితో, మేనేజర్ మమత

జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ప్రభుత్వ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందిన దివ్యాంగ యువకుడికి ఉపాధి అవకాశం కల్పించేందుకు గృహం మేనేజర్ మమత చొరవ చూపారు. ఆ వివరాలు... ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తి చేసిన గుమ్మడి నానికి తల్లిదండ్రులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో గృహంలో ఆశ్రయం పొందుతున్నాడు. అతడికి ఉపాధి కల్పించేందుకు గృహం మేనేజర్ మమత ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడారు. ఆసుపత్రి యాజమాన్యం స్పందించి ల్యాబ్ టెక్నీషియన్‌గా అవకాశం కల్పించారు. మంగళవారం అతడు విధుల్లో చేరారు.

–న్యూస్‌టుడే, ఎన్ఏడీకూడలి (కాకానినగర్)

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సింధియా, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ వివరాలు... ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన **మజ్జి మణికంఠ**(28) ఈనెల 14న పారిశ్రామిక ప్రాంతం కొత్తనక్కవానిపాలెంలోని ద్విచక్ర వాహన షోరూంలో సూపర్‌వైజర్‌గా విధులు చేరాడు. 18న షోరూం పని నిమిత్తం తోటి ఉద్యోగితో కలిసి స్కూటీపై గాజువాక వెళ్తుండగా, మార్గమధ్యలో ఆగి ఉన్న వ్యాన్‌ను స్కూటీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక సీట్లో కూర్చొన్న మణికంఠ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ ఈనెల 20న సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి ఈ ఏడాది ఫిబ్రవరిలో నగరంలోని కంచరపాలేనికి చెందిన యువతితో వివాహమైంది. గాజువాక పోలీసులు తొలుత గాయాలైనట్టు కేసు నమోదు చేసి, తర్వాత మృతి కింద మార్చారు.

అటు పనులు.. ఇటు ట్రాఫిక్

న్యూస్‌టుడే, గాజువాక: గాజువాక కణితిరోడ్డు నుంచి వినాయకనగర్ వెళ్లే వుడా రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. శిథిలావస్థకు చేరిన రహదారిని బాగు చేస్తుండడంతో మంగళవారం రాకపోకల్ని నియంత్రించారు. ఆయా వాహనాలను సింహగిరికాలనీ, అంబేడ్కర్‌నగర్ మార్గంలోకి మళ్లించారు. ఇరుకు రోడ్డు కావడంతో అటు గాజువాక, ఇటు పెదగంట్యాడ నుంచి వచ్చిన వాహనాలన్నీ రద్దీలో చిక్కుకున్నాయి. బీటు కానిస్టేబుల్స్ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బుధవారం కూడా రహదారి పనులు జరుగుతాయని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు ఇబ్బందుల్లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


రోడ్డుపై పోసిన కంకర

ఫోకస్


అంబేడ్కర్ కాలనీ వద్ద నిలిచిన వాహనాలు

ఫీజుల తగ్గింపునకు విన్నపం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గత ప్రభుత్వంలో పెంచిన ఫీజులు తగ్గించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎ.ఐ.ఎస్.ఎఫ్)కోరింది. ఈ మేరకు మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు వినతిపత్రం అందించింది. ఎ.ఐ.ఎస్.ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి నాగరాజు దూర ప్రాంతాల నుంచి వచ్చి వర్సిటీలో ఉన్నత చదువులు చదవాలని వచ్చిన విద్యార్థులు ఫీజులు కట్టలేకపోతున్నారన్నారు. ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విశ్వవిద్యాలయం నాయకులు అభిషేక్, చైతన్య, వికాస్, శివరామ్ రెడ్డి, రాము, శివరాజ్ కుమార్, శ్వేత, లలిత తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 29న విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: విశాఖలో డిసెంబరు 29న ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు పులగం రామచంద్రారెడ్డి తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సినీ రంగంలోని 24 విభాగాల్లో పనిచేస్తున్న కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సినీరంగ ప్రముఖులు, దర్శకులు, నటులు హాజరవుతారని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు హెచ్‌ఆర్.దిలీప్‌కుమార్, సత్యనారాయణ, కుమార్‌నాయక్, శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవన స్థితిగతులపై పుస్తకావిష్కరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మత్స్యకారుల జీవన స్థితిగతులపై మత్స్యకార యువకుడు పిక్కి కోదండరావు రచించిన 'మత్స్యకారుల పుట్టుక, వికాసం, అభివృద్ధి' పుస్తకావిష్కరణ ఆంధ్రవిశ్వవిద్యాలయం టి.ఎల్.ఎన్.సభాహాలులో జరిగింది. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ అధ్యక్షులు మోస అప్పలరాజు, ఆవాల రమేష్, మత్స్యకార నాయకులు, తెలుగు శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

లంకెలపాలెం(పరవాడ)న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల ఖోఖో పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. పోటీలను ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్ రావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 320 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారు వచ్చే నెల 6, 7 తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఎస్ఎంసి ఛైర్మన్ గుర్రం అప్పలరాజు, పరిశీలకులు రాజు, పీడీలు కేఎం నాయుడు, కిరణ్, లక్ష్మి, తులసీ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

తుప్పల్ని తొలగించరూ..!

జీవీఎంసీ 57వ వార్డు మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌లో పిచ్చిమొక్కలు, తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో విష పురుగుల సంచారం ఎక్కువైందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలు నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని నివాసితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. నివాసిత ప్రాంతాల్లో శుభ్రత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కరాస

దర్పణం

